ప్రజాశక్తి

గురువారం 19 డిసెంబర్ 2024

8 పేజీలు





విశాఖపట్నం అనకాపల్లి

కాలయాపన.. సాగదీత...

- విశాఖ జిల్లా రైతుల భూములపై దేవస్థానం, మాన్సాస్ పెత్తనం
- 'పంచ' గ్రామాల పరిధిలో 1785 ఎకరాలు, ఆనందపురం మండలం బోనిలో మాన్సాస్ 610 ఎకరాలపై ఏళ్లుగా ప్రజలు, రైతుల ఆందోళన



అశోక్‌గజపతిరాజును కలిసిన విశాఖ ఎమ్మెల్యేలు (ఫైల్ ఫొటో)

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

దేవస్థానానికి దఖలు పడిన భూముల విషయంలో గత ప్రభుత్వం అనేక కమిటీలు, భేటీల పేరుతో కాలయాపన చేస్తూ రాగా ప్రస్తుత 'కూటమి' సర్కారు సదస్సుల పేరుతో సాగదీసేందుకు చూస్తోంది. ఏ గ్రామంలో ఏ సర్వే నెంబరులో ఎంతెంత భూమి వివాదంలో ఉంది? దళితుల సాగుభూమిని ఎక్కడెక్కడ పెత్తందార్లు ఆక్రమించి అనుభవిస్తూ వ్యాపారాలు చేస్తున్నారు? దేవస్థానం పేరుతో రైతులను భూముల్లోకి రాకుండా పంచగ్రామాల్లో నడుస్తున్న తంతు ఏమిటి? ఈ వివరాలన్నీ రెవెన్యూ వద్ద గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకూ ఉన్నా సరే రెవెన్యూ సదస్సుల పేరుతో పిటిషన్ల తంతును నడిపేందుకు మొగ్గుచూడడం దేనికి? అంటూ విశాఖ జిల్లా రైతులు, ప్రజలు తీవ్రస్థాయిలో అభ్యంతరం తెలుపుతున్నారు. ఆనందపురం మండలం బోని సమీపంలో రెవెన్యూ సదస్సు బుధవారం జరగాల్సి ఉండగా తుపాను కారణంగా వాయిదా వేసేశారు. బోని గ్రామంలో 50ఏళ్లుగా 610 ఎకరాల మాన్సాస్ భూమిపై రైతులు పట్టాల కోసం పోరాడుతున్నారు. రెవెన్యూ సదస్సు జరిగి ఉంటే ఇదే పెద్ద వివాదం అయి ఉండేది. బోని, శిర్లపాలెం, ముకుందపురం, మజ్జి, బోని గ్రామాల్లో గల మరో 130 ఎకరాలు ఇనాం భూములను రైతులే సాగు చేస్తున్నా వీరికి పట్టాలివ్వడం లేదు. తాజాగా మాన్సాస్‌కు చెందిన 610 ఎకరాలకు, ఈ 130 ఎకరాలకు శిస్తు కట్టాలని ఏటా ఒక రైతు రూ.5వేలు చెల్లించాలంటూ మాన్సాస్, రెవెన్యూ నుంచి ఒత్తిడి రైతులపై ఉంది. పట్టాల్లేకుండా శిస్తు కట్టమంటూ రైతులు మొండికేస్తూ రెవెన్యూ సదస్సుల్లో తేల్చుకోవాలని చూసినా ఫలితం లేకపోయింది.

సింహాచలం ధర్మకర్త అశోక్ 'రాజు'తో ఎమ్మెల్యేల భేటీ...

ఇటీవలే సింహాచలం దేవస్థానం పంచగ్రామాల భూముల క్రమబద్ధీకరణ విషయంపై సింహాచలం దేవస్థానం చైర్మన్ పూసపాటి అశోక్‌గజపతిరాజుతో గాజువాక, ఉత్తరం, తూర్పు, పశ్చిమం, పెందుర్తి ఎమ్మెల్యేలు భేటీ నిర్వహించారు. 'రాజు'తో వీరంతా చిలకపలుకులు

మిగతా 2లో..

28, 29న సిపిఎం జిల్లా మహాసభలు

- 28న పెందుర్తిలో భారీ ప్రదర్శన, బహిరంగ సభ
- సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు



సిపిఎం జిల్లా మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జగ్గునాయుడు తదితరులు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : సిపిఎం విశాఖ జిల్లా మహాసభలు ఈ నెల 28, 29 తేదీలలో పెందుర్తి సుజాతనగర్‌లో జరుగనున్నాయని సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు తెలిపారు. 28న ఉదయం 10 గంటలకు పెందుర్తి జూనియర్ కాలేజీ నుంచి సుజాతనగర్ వరకు భారీ ప్రదర్శన జరుగుతుందని చెప్పారు. ఈ ప్రదర్శన, బహిరంగ సభలో ప్రజలు, కార్మికులు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

జగదాంబ సమీపంలోని నండూరిప్రసాదరావు భవన్‌లో బుధవారం సిపిఎం జిల్లా కమిటీ ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, కార్యదర్శివర్గ సభ్యులు ఆర్‌కెఎస్‌వి.కుమార్, సీనియర్ నాయకులు ఎస్.జ్యోతీశ్వరరావు, జిల్లా కమిటీ సభ్యులు వి.కృష్ణారావులు పాల్గొని మహాసభల పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా జగ్గునాయుడు మాట్లాడుతూ, గత మూడేళ్ల కాలంలో నిర్వహించిన కార్మిక, ప్రజా పోరాటాలను ఈ మహాసభల్లో సమీక్షించుకొని రాబోయే మూడేళ్ల కాలంలో చేపట్టబోయే ఉద్యమ ప్రణాళిక విడుదల చేయనున్నట్లు తెలిపారు. గత వైసిపి ప్రభుత్వం ప్రజలపై వేసిన ఆస్తిపన్ను, చెత్తపన్ను, విద్యుత్ ఛార్జీల భారాలకు వ్యతిరేకంగా ప్రజలను సమీకరించి సిపిఎం ఉద్యమించిందన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వరంగ సంస్థల పరిరక్షణకు ఉత్తరాంధ్ర బైక్‌యాత్ర, నిరాహారదీక్షలు, అనేక రూపాల్లో నిరసనలు చేపట్టి ప్రయివేటీకరణ కాకుండా అడ్డుకోగలిగిందని తెలిపారు. కుసులవాడ మైనింగ్, ముడసర్లోవ, దసపల్లా, ఎర్రమట్టిదిబ్బల భూ కుంభకోణాలపై ఉద్యమించిందన్నారు. సంఘటిత, అసంఘటితరంగ కార్మికుల సమస్యలపై అనేక పోరాటం చేయడమే కాకుండా కార్మికవర్గం చేపట్టే పోరాటాలలో ప్రత్యక్షంగా పాల్గొని మద్దతిచ్చిందన్నారు. విశాఖపట్నంలో కొండవాలు ప్రాంతాలు, మురికివాడ ప్రాంతాల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై సిపిఎం గొంతెత్తిందన్నారు. టిడిపి, వైసిపి ప్రభుత్వాలు పేదలకు ఇళ్లు, ఇళ్ల స్థలాలు ఇస్తామని చెప్పి మోసగించడాన్ని సిపిఎం తీవ్రంగా

మిగతా 2లో..

భూ సమస్యల పరిష్కారంపై విశ్వాసమివ్వని ప్రాంతీయ సదస్సు

వార్త 5లో..

కనీస వేతనం కోసం ఆందోళన

వార్త మెయిన్ 2లో..

భరిణికం గ్రామంలో డయేరియా

వార్త 6లో..

విద్యుత్ ఛార్జీల్లో ఎపి 'టాప్' లేపారు!

వార్త 4లో..



జలప్రవేశం చేసిన ఐఎన్ఎస్ నిర్దేశక్

ఐఎన్ఎస్ నిర్దేశక్ ప్రారంభం

వార్త మెయిన్‌లో....

పట్టణ ప్రణాళిక విభాగంపై శుక్రవారం ఫిర్యాదుల స్వీకరణ

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ

జివిఎంసి పరిధిలో ప్రతి శుక్రవారమూ పట్టణ ప్రణాళిక విభాగానికి సంబంధించి ప్రజల నుంచి ఫిర్యాదులను, వినతులను స్వీకరించనున్నట్లు జివిఎంసి కమిషనర్ డాక్టర్ పి.సంపత్‌కుమార్ బుధవారం తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జివిఎంసిలో ప్రతి సోమవారం నిర్వహిస్తున్నప్పటికీ పట్టణ ప్రణాళిక విభాగానికి సంబంధించి అధికంగా ప్రజల నుంచి ఫిర్యాదులు/వినతులు వస్తున్నాయని కమిషనరు తెలిపారు. కావున పట్టణ ప్రణాళిక విభాగానికి సంబంధించి ఫిర్యాదులను, వినతులను ప్రతి శుక్రవారమూ ఉదయం 10 గంటల నుంచి పట్టణ ప్రణాళిక అధికారులు ప్రత్యేకంగా జివిఎంసి ప్రధాన కార్యాలయంలో స్వీకరిస్తారని పేర్కొన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



వినతులు స్వీకరిస్తున్న ఏక సభ్య కమిషన్ చైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రా

ఎస్‌సి వర్గీకరణపై...

ఏకసభ్య కమిషన్ వినతుల స్వీకరణ

వార్త మెయిన్, టాబ్లాయిడ్ లోపలి పేజీల్లో....

8, 9న ఎపి డిజిటల్ టెక్నాలజీ సమ్మిట్

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : ఎపి డిజిటల్ టెక్నాలజీ ఇండస్ట్రీ లీడర్ షిప్ ఫోరం ఆధ్వర్యాన 2025 జనవరి 8, 9 తేదీలలో సిరిపురంలోని వియంఆర్‌డిఎ చిల్డ్రన్ ఎరినా వేదికగా ఏపీ డిజిటల్ టెక్నాలజీ సమ్మిట్-2025ను నిర్వహిస్తున్నామని ఆ సంస్థ కన్వీనర్ శ్రీధర్ కోసరాజు తెలిపారు. బుధవారం ఉదయం బీచ్ రోడ్‌లోని అంబికా సి గ్రీన్ హోటల్‌లో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రెండు రోజులపాటు జరిగే ఈ కార్యక్రమంలో మొదటి రోజు కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఎలక్ట్రానిక్, హెచ్‌ఆర్‌డి శాఖ మంత్రి నారా లోకేష్ హాజరవుతారని, రెండవ రోజు కార్యక్రమానికి ఎంఎస్‌ఎంఇ శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్, మాజీ కేంద్ర మంత్రి రాజీవ్ చంద్రశేఖర్ హాజరవుతారని తెలిపారు. సమ్మిట్‌లో ఐటి, ఐటిఇఎస్, ఎఐ, ఎమర్జింగ్ టెక్నాలజీ, ఎలక్ట్రానిక్స్, స్మార్ట్ అండ్ సస్టైనబుల్ టెక్నాలజీ, మెడికల్ అండ్ హెల్త్ టెక్నాలజీ, క్రియేటివ్ టెక్నాలజీ అంశాలపై చర్చించనున్నట్లు పేర్కొన్నారు.

వీఎఫ్‌ఎక్స్, సైబర్ సెక్యూరిటీ, క్లౌడ్ మేనేజ్‌మెంట్ అంశాలపై సెమినార్లు ఉంటాయని తెలిపారు. వచ్చే ఐదేళ్లలో విశాఖపట్నంలో ఐటి అభివృద్ధి చెందేందుకు భవిష్యత్తు ప్రణాళిక రూపొందించనున్నట్లు వివరించారు.. ఈ మీడియా సమావేశంలో సంస్థ ప్రతినిధులు ఆకారపు కుమార్, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీధర్ కొసరాజు

సినీ రంగంలో శోభన్‌బాబుకు సుస్థిర స్థానం

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : తెలుగు సినీరంగంలో ఆరు అడుగుల అందగాడిగా పేరుగాంచిన శోభన్ బాబుకు సుస్థిర స్థానం ఉందని శోభన్‌బాబు సిటీవైడ్ ఫ్యాన్స్ అధ్యక్షులు కోడూరు కనకరాజు అన్నారు. డాబాగార్డెన్స్ వద్ద ఉన్న శోభన్ బాబు కాంస్య విగ్రహానికి బుధవారం పూలమాలలు వేసి ఘనంగా నివాళలర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇక్కడ విగ్రహం ఏర్పాటుచేసి ఏడాది పూర్తయిందని, ఈ సందర్భంగా శోభన్ బాబు అభిమానులు పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారని తెలిపారు. జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు గౌరవ అతిథిగా హాజరై మాట్లాడుతూ, శోభన్‌బాబు ఫ్యాన్స్ నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమన్నారు. పేదలకు నిరంతరం అన్నదానం, వస్త్రదానం నిర్వహించడం ఎంతో మందికి స్ఫూర్తిదాయకమన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు రమణ, శోభన్‌బాబు, నాగరాజు, త్రినాథ్ పాల్గొన్నారు.

నాన్ డయేరియా కేసుల్లో డీహైడ్రేషన్‌పై అశ్రద్ధ

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : నాన్ డయేరియా కేసుల్లో డీహైడ్రేషన్‌పై అశ్రద్ధ వహిస్తున్నారని కెన్‌వ్యూ ఇండియా ది హైడ్రేషన్ గ్యాప్ ఫర్ నాన్ డయేరియా ఇల్నెసెస్ నివేదిక పేర్కొందని అపోలో ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్ ప్రొఫెసర్ డాక్టర్ ఎన్ఎల్.శ్రీధర్ మీడియాకు తెలిపారు. 45 శాతం మంది ద్రవం, ఎలక్ట్రోలైట్ లోటుతో బాధపడుతున్నారని తెలిపారు. డయేరియా రోగులకు మొదటి రోజే ఓరల్ ఫ్లూయిడ్ ఎలక్ట్రోలైట్స్, ఎనర్జీ రీప్లేస్మెంట్ సిఫార్సు చేయాలన్నారు.

రికార్డు స్థాయిలో క్లెయిమ్‌ల పరిష్కారం

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ : ఐసిఐసిఐ ప్రుడెన్షియల్ లైఫ్ ఇన్స్యూరెన్స్ జులై 2024 నుంచి సెప్టెంబర్ 2024 వరకు పరిశ్రమలోనే అత్యధికంగా 99.04 శాతం క్లెయిమ్ సెటిల్‌మెంట్ అందించిందని సిరిపురంలోని సంస్థ కార్యాలయం చీఫ్ ఆపరేషన్స్ ఆఫీసర్ అమిష్ బ్యాంకర్ తెలిపారు. తమ సంస్థ డెత్ క్లెయిమ్‌ను సెటిల్ చేయడానికి తీసుకున్న సగటు సమయం కేవలం ఒకటిన్నర రోజులు మాత్రమేనని పేర్కొన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండవ అర్ధ సంవత్సరంలో తాము 99.04 శాతం క్లెయిమ్ సెటిల్‌మెంట్ నిష్పత్తిని మించి సాధించేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. మొత్తం రూ. 451 కోట్లకుపైగా డెత్ క్లెయిమ్‌లను సెటిల్ చేసామని వివరించారు.

విశాఖలో రివర్ స్టోర్ ప్రారంభం

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : బెంగళూరుకు చెందిన ఎలక్ట్రిక్ స్కూటర్ల తయారీ సంస్థ రివర్ విశాఖపట్నంలో తన మొదటి స్టోర్‌ను బుధవారం ఉదయం పెదవాల్తేర్ మెయిన్ రోడ్‌లో ప్రారంభించింది. ఈ సందర్భంగా రివర్ స్టోర్ హెడ్ అరవింద్ మణి మాట్లాడుతూ, విశాఖ నగరంలో శ్రీరామ్ మోటార్స్ సహకారంతో ఈ స్టోర్‌ను ప్రారంభించామన్నారు. తమ సంస్థ స్కూటర్లు, యాక్సెసరీస్‌పై పలు ఆఫర్లను అందిస్తుందని తెలిపారు. రివర్ స్టోర్‌లో వాక్ ఇన్స్ , డెలివరీ కస్టమర్లకు ప్రత్యేకమైన సేవలు అందిస్తామన్నారు. ఇప్పటికే విశాఖపట్నం నుంచి తమకు చాలా ప్రీ-ఆర్డర్లు వచ్చాయని తెలిపారు. 2025 మార్చి నాటికి దేశవ్యాప్తంగా 25 రివర్ స్టోర్లను ఏర్పాటుచేయాలని భావిస్తున్నామని తెలిపారు. ఇండీ ఎలక్ట్రిక్ స్కూటర్ ధర రూ. 1,42,999 (ఎక్స్-షోరూమ్, విశాఖపట్నం)గా ఉందని, కస్టమర్లు స్టోర్ ను సందర్శించి టెస్ట్ రైడ్‌లు చేయవచ్చునని, టెస్ట్ రైడ్స్ కోసం తమ స్టోర్‌ను నేరుగా గాని, www.rideriver.inలో కానీ సందర్శించాలని కోరారు.

ఈస్ట్ కోస్ట్ రైల్వే శ్రామిక కాంగ్రెస్ విజయోత్సవం

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : భారత రైల్వే గుర్తింపు యూనియన్ ఎన్నికలలో వాల్తేర్ డివిజన్ పరిధిలో అత్యధిక ఓట్లు సాధించిన సందర్భంగా ఈస్ట్ కోస్ట్ రైల్వే శ్రామిక కాంగ్రెస్ ఆధ్వర్యాన బుధవారం సాయంత్రం రైల్వే స్టేషన్ నుంచి డిఆర్ఎం కార్యాలయం వరకు విజయోత్సవ ర్యాలీని నిర్వహించారు. యూనియన్ డివై ఎ.వెంకటరావు ఆధ్వర్యాన జరిగిన ర్యాలీలో యూనియన్ డివిజనల్ కో-ఆర్డినేటర్ ఆర్‌సి.సాహూ, జోనల్ సెక్రటరీ జె.సంపత్‌కుమార్, ప్రెసిడెంట్ మౌలీశ్వరరావు పాల్గొన్నారు.

మొదటి పేజీ తరువాయి..

కాలయాపన.. సాగదీత...

పలుకుతూ ఎన్నోఏళ్లుగా ఉండే ఈ సమస్యకు పరిష్కారం త్వరలో లభించాలంటూ ఆశాభావం వ్యక్తం చేయడం విశేషం. లక్ష మంది ప్రజలు, 25వేల కుటుంబాలకు చెందిన 1785 ఎకరాలను సింహాచలం దేవస్థానం క్లియర్ చేయాలంటే 'రాజు' అనుమతి కావాల్సిందే. ప్రభుత్వం ఈయన్ను ఒప్పించి మెప్పించగలిగితే సరిపోతుంది. కానీ ఆ పని గత చంద్రబాబు పాలనాకాలంలో ఏనాడూ జరగలేదు. అప్పుడు జరగనిది ఇప్పుడు జరిగిపోతుందంటూ ప్రచారం చేస్తున్నారు. 1997 సంవత్సరంలోనే అప్పటి టిడిపి ప్రభుత్వం ప్రస్తుత కూటమి ప్రభుత్వ ముఖ్యమంత్రి చంద్రబాబు జిఒ 578 తీసుకొచ్చి ఏకపక్షంగా ఈ భూమంతా సింహాచలం దేవస్థానానిదే అంటూ రైత్వారీ పట్టాలను ఇప్పించేయడంతో అప్పటివరకూ ఏ కాగితం లేని దేవస్థానానికి ఈ భూమిపై హక్కు వచ్చేసింది. రైతులు, ప్రజలు నాటినుంచీ నానా అవస్థలు పడుతూ వస్తున్నారు. పరిష్కారం అదిగో ఇదిగో అనడం మినహా ఏళ్ల తరబడి రైతుల కష్టం ఏమవుతుందో ప్రభుత్వం ఏం చేస్తుందో సర్వత్రా ఆందోళన నెలకొంది.

28, 29న సిపిఎం జిల్లా మహాసభలు

ఖండిస్తూ పేదలకు ఇళ్లు, ఇళ్లపట్టాలు ఇవ్వాలని ఉద్యమించిందని తెలిపారు. ఈ మహాసభల్లో ఈ పోరాటాలపై సమీక్ష చేపట్టి రాబోయే మూడేళ్లకాలంలో టిడిపి కూటమి ప్రభుత్వం, కేంద్ర బిజెపి ప్రభుత్వం వేయబోయే విద్యుత్ ఛార్జీలు, స్మార్ట్‌మీటర్లకు వ్యతిరేకంగా ఉద్యమాన్ని ప్రారంభించిందన్నారు. విశాఖ సమగ్రాభివృద్ధి, కార్మికులు, మహిళలు, యువత, విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై సమరశీల పోరాటాలకు సిద్ధమవుతోందన్నారు. జగనన్న ఇళ్లు, టిడ్కో వంటి ఇళ్లకు పేదలకు ఇప్పటికే డీడీలు రూపంలో డబ్బులు చెల్లించినందున ఇళ్ల సాధనకు ప్రజా ఉద్యమానికి రూపకల్పన చేస్తోందన్నారు. ఈ మహాసభలను జయప్రదం చేయాలని కోరారు.

ప్లాస్టిక్ వినియోగాన్ని నిలిపివేయాలి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : ఫిషింగ్ హార్బర్‌లో జనవరి ఒకటి నుంచి సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను వినియోగించరాదని మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్ పి.లక్ష్మణరావు కోరారు. మత్స్యశాఖ జెడి కార్యాలయంలో బోటు యజమానులు, చేపల వ్యాపారులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లా కలెక్టర్ నిర్ణయం మేరకు జనవరి 1 నుంచి జిల్లాలో పూర్తిగా సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగం నిషేధం అమలు చేస్తున్నారని తెలిపారు. కనుక ఫిషింగ్ బోట్లు, ఫిషింగ్ హార్బర్ పరిసరాలలో, ఫిష్ మార్కెట్లు, ఫిష్ లాండింగ్ కేంద్రాల వద్ద ప్లాస్టిక్ వినియోగం నిలుపుదల చేసి వాతావరణాన్ని కాపాడడంలో సహకరించాలని కోరారు.

ప్లాస్టిక్ వాడక నిషేధంపై మత్స్యశాఖ ఆధ్వర్యాన ఒక బృందాన్ని ఏర్పాటుచేసి మత్స్యకారులకు అవగాహన కల్పిస్తామని తెలిపారు. డబ్ల్యుడబ్ల్యుఎఫ్ ప్రతినిధి హనీ పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా ప్లాస్టిక్ ప్రభావం వలన సముద్ర సంపద తరిగిపోవడం, మానవ ఆరోగ్యంపై ప్రభావం గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో మత్స్యశాఖ అభివృద్ధి అధికారి డి.మురళి, రత్నం, బోటు యజమానులు వీర్రాజు, నాగరాజు, బాలాజీ, మత్స్యకార మహిళలు పాల్గొన్నారు.

21 నుంచి మహాభారత కథ

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : అయోధ్య రామ తీర్థ ట్రస్ట్ కోశాధికారి గోవింద్ దేవగిరి మహారాజ్ చే మహా భారత్ కథ యజ్ఞం విశాఖలో నిర్వహిస్తున్నట్లు ఉత్తర భారత నిర్వాహకులు సునీల్ చౌదరి, సమన్వయకర్త సునీల్ బాలాసరియా తెలిపారు. నగరంలోని గాదిరాజు ప్యాలెస్ వేదికగా ఈనెల 21వ తేదీ నుంచి 27వ తేదీ వరకు ఉంటుందని పేర్కొన్నారు. మహా భారతంలో పాండవులు, కౌరవుల జననం, బాల్యం, వివాదాలు, వివాహం, యుద్ధానికి దారి తీసిన పరిస్థితులు, మహా భారత యుద్ధం, శ్రీకృష్ణుని లీలలు, భగవద్గీత ప్రవచనం తదితర అంశాలను గోవింద్ మహారాజ్ వివరిస్తారని వారు తెలిపారు. కార్యక్రమంలో భాగంగా ఈ నెల 21వ తేదీన వైఎంసిఎ నుంచి గాదిరాజు ప్యాలెస్ వరకు కలశ యాత్ర నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

మాస్టర్ ప్లాన్ రోడ్ల అభివృద్ధికి చర్యలు

జివిఎంసి కమిషనర్ డాక్టర్ సంపత్‌కుమార్



మాస్టర్ ప్లాన్ రోడ్ల మ్యాప్ పరిశీలిస్తున్న జివిఎంసి కమిషనర్

ప్రజాశక్తి -భీమునిపట్నం : జివిఎంసి నాలుగోవార్డు కాపులుప్పాడలో ప్రతిపాదిత మాస్టర్ ప్లాన్ రోడ్లను పట్టణ ప్రణాళిక విభాగం అధికారులతో కలిసి జివిఎంసి కమిషనర్ పి సంపత్ కుమార్ బుధవారం పరిశీలించారు. ఇందుకు సంబంధించి ప్లాన్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, నగరాభివృద్ధిలో భాగంగా పెరుగుతున్న జనాభా, ప్రజల అవసరాలు, ట్రాఫిక్ దృష్ట్యా మాస్టర్ ప్లాన్ రోడ్లను అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు ఇందులో భాగంగా కాపులుప్పాడ, కె నగరపాలెం జంక్షన్ నుంచి బోయిపాలెం వరకు ప్రస్తుతమున్న 40, 60, 100 అడుగుల రోడ్ల అభివృద్ధిపై వియంఆర్‌డిఎ అధికారులతో చర్చించనున్నట్లు తెలిపారు. పర్యటనలో జివిఎంసి చీఫ్ సిటీ ప్లానర్ ఎ ప్రభాకరరావు, డిసిపి హరిదాస్, ఎసిపి రామకృష్ణ, టిపిఒ విజయకుమార్ పాల్గొన్నారు

వికలాంగుల ఉపకరణాల మంజూరుకు

నేడు గుర్తింపు శిబిరం

ప్రజాశక్తి-పద్మనాభం : వికలాంగులకు అవసరమైన ఉపకరణాల గుర్తింపునకు భీమిలి నియోజకవర్గ స్థాయిలో మండలంలోని రెడ్డిపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్ గుర్తింపు శిబిరాన్ని ఈ నెల 19న గురువారం నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ ఎం.విజయకుమార్ తెలిపారు జిల్లా వికలాంగుల సంక్షేమశాఖ, ఐడిబిఐ సౌజన్యంతో నిర్వహించే శిబిరంలో వికలాంగులకు అవసరమైన ఉపకరణాలను గుర్తించి వారికి ఉచితంగా అందజేస్తారన్నారు. నియోజకవర్గంలోని వికలాంగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

టిడిఆర్‌లు ఇప్పించాలని వినతి



గంటాకు వినతిపత్రం ఇస్తున్న నిర్వాసితులు

ప్రజాశక్తి -మధురవాడ :జివిఎంసి ఆరోవార్డు రేవళ్లపాలెంలో రోడ్డు విస్తరణ బాధితులకు టిడిఆర్ ఇస్తామని చెప్పి, నేటికీ ఇవ్వకుండా మోసం చేశారని నిర్వాసితులు ఆవేదన వ్యక్తంచేశారు. ఈమేరకు తమకు న్యాయం చేయాలని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావుకు బుధవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రేవళ్లపాలెంలో 80 అడుగుల రోడ్డు విస్తరణ చేపట్టిన అధికారులు, నిర్వాసితులకు నాలుగు రెట్లు టిడిఆర్ ఇస్తామని నమ్మబలికారని, ఈమేరకు తమనుంచి హక్కుపత్రాలను కూడా తీసుకున్నారని వాపోయారు. నేటికీ తమకు పరిహారమివ్వలేదని, ఎన్నో సార్లు అధికారులకు మొరపెట్టుకున్నా స్పందించలేదని విన్నవించారు. తమకు న్యాయంచేయాలని గంటాను వేడు కున్నారు.కార్యక్రమంలో నాగోతి వెంకటరావు, పోతిన శ్రీను, వాండ్రాసి వెంకటప్పారావు, పిళ్ళా రమణ పాల్గొన్నారు.

సిఎం సహాయనిధి సాయం అందజేత

ప్రజాశక్తి -భీమునిపట్నం : కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న స్థానిక మహిళకు సిఎం సహాయనిధి నుంచి మంజూరైన రూ 2.23 లక్షల ఆర్థికసాయం చెక్కును స్థానిక ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు బుధవారం అందజేశారు. నగరంలో ఎంవిపి కాలనీలోని తన నివాసంలో బాధిత మహిళ లక్ష్మికి ఎమ్మెల్యే గంటా చెక్కును అందజేశారు ఈ మేరకు సిఎం చంద్రబాబు, ఎమ్మెల్యే గంటాకు బాధితురాలు లక్ష్మితోపాటు ఆమె భర్త, ప్రైవేటు సెక్యూరిటీ గార్డు పాపునాయుడు కృతజ్ఞతలు తెలిపారు

వర్షంతో వరి పంటకు నష్టం!

- పొలాల్లోనే తడిసిపోయిన కోసిన వరి పనలు
- నేలవాలిపోయిన కోతకు సిద్ధంగా ఉన్న చేను
- ఆందోళన వ్యక్తం చేస్తున్న అన్నదాతలు

ప్రజాశక్తి -భీమునిపట్నం : వరుస తుపాన్లు అన్నదాతలను ఆందోళనకు గురిచేస్తున్నాయి. ప్రస్తుతం నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన అల్ప పీడన ప్రభావంతో కురుస్తున్న వర్షాలు రైతన్నలకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. ఖరీఫ్ తొలి రోజుల్లో వర్షాలు అనుకూలించడంతో సాధారణం కన్నా ఎక్కువ విస్తీర్ణంలో వరిసాగు కాగా, పంట కూడా ఆశాజనకంగా ఉండడంతో దిగుబడులపై రైతులు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. నవంబర్ నెలలో ఎడతెరిపి లేని వర్షాలు, డిసెంబర్ మొదటలో ఫంగల్ తుపాన్, తాజాగా కురుస్తున్న వర్షాలు రైతులను ఆర్థికంగా ముంచేశాయి.



మజ్జి పేటలో నేల వాలిన పంట

కోసిన వరిచేను... పొలాల్లోనే..

ఖరీఫ్ సీజన్ తుది దశకు చేరుకోగా, భీమిలి మండలం మజ్జిపేట, తాటితూరు, పద్మనాభం మండలం ఐనాడ తది తర గ్రామాల్లో అనేక పొలాల్లో కోసిన వరి పైరు పొలాల్లోనే ఉండిపోయింది. ఈనేపథ్యంలో చినుకులు పడుతుండడంతో ఏం చేయాలో పాలుపోక రైతులు దిక్కులు చూస్తున్నారు.కొంత పంటను చక్కబెట్టుకున్న ప్పటికీ, అనేక ఎకరాల్లో ఇంకా పైర్లు కోత దశలో ఉన్నాయి. ఈ నేపథ్యంలో కురుస్తున్న వర్షాలకు తడిసిన వరివెన్నులు, పైర్లు బరువెక్కి వాలిపోయి నేలనంటాయి. అలా పడిపోయిన చేనుపై చినుకులు రాలడంతో నేలనంటిన నష్టం జరుగుతుందని రైతులు ఆవేదన చెందుతున్నారు. తడిసి మోపెడైన పెట్టుబడులు పెట్టి, పంట చేతికి వస్తుందన్న దశలో ఇలా వర్షంతో నష్టం జరుగుతుండడంపై రైతన్నలు కలవరం చెందుతున్నారు. వర్షాలు కురుస్తాయన్న ఆదుర్దాలో పండిన చేనును కోయడానికి మహిళలకు రూ.600, పురుషునికి రూ.700 కూలీనిచ్చి పనులు చేయించానని, ఇంతలో వర్షం కురవడంతో కోసిన పనలు పొలంలోనే ఉండి పోయాయని మజ్జిపేటకు చెందిన రైతు మజ్జి వెంకట రావు ఆవేదన చెందుతున్నాడు. ప్రస్తుతం వర్షాలకు తాను సాగుచేసిన ఎకరం వరిపైరు పూర్తిగా తడిసి పోయిందని కారెపు రామారావు వాపోయారు.

ఘనంగా కేంద్రమంత్రి రామ్మోహన్ జన్మదిన వేడుక



ఆహార పొట్లాలను అందజేస్తున్న ఆనంద్

ప్రజాశక్తి - ఆరిలోవ : కేంద్ర విమానయాన శాఖా మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు జన్మదిన వేడుకలను ఆనంద్ గ్రూప్ సంస్థ ఆధ్వర్యంలో ఏడు రాష్ట్రాల్లో అన్నదాన కార్యక్రమాలతో ఘనంగా నిర్వహించారు.. ఇందులో భాగంగా విశాఖలోని ఆరిలోవ హెల్త్ సిటీలో రోగులకు ఆనంద్ గ్రూప్ ఛైర్మన్ ఆనంద్‌కుమార్, యూత్ అసోసియేషన్ సభ్యులు భోజన ప్యాకెట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ తండ్రి ఎర్రన్నాయుడు ఆశయసాధనకు చిన్న వయస్సులోనే రామ్మోహన్‌నాయుడు కృషిచేస్తున్నారనికొనియాడారు. ఆయన మరిన్ని పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు మహారాష్ట్ర, గోవా, మధ్యప్రదేశ్, కర్నాటక రాష్ట్రాలలో అన్నదానం చేశారు.

అధిక తేమ నుంచి పంట ఉత్పత్తుల రక్షణ

'హైబ్రిడ్ సోలార్ డిహైడ్రేటర్' రూపకల్పన చేసిన జిటెక్ నిపుణులు

ప్రజాశక్తి - మధురవాడ : ఏడాది పొడుగునా అధిక తేమ వాతావరణముండే ఈశాన్య రాష్ట్రాల్లో ఉద్యాన వన పంటలు, వివిధ వ్యవసాయ ఉత్పత్తులను మార్కెట్ ప్రమాణాలకు అనుగుణంగా భద్రపరచడానికి అనువైన సాంకేతిక పరిజ్ఞానంతో హైబ్రిడ్ సోలార్ డిహైడ్రేటర్‌ను గీతం టెక్నాలజీ ఎనేబిలింగ్ సెంటర్ (జిటెక్) నిపుణులు రూపకల్పన చేశారు. ఈ సాంకేతిక పరిజ్ఞానాన్ని మిజోరామ్ రాష్ట్ర ఉద్యానవన శాఖా మంత్రి ప్రొఫెసర్ లాల్ నిలావ్‌మాకు జిటెక్ కోఆర్డినేటర్, గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్ డీన్ ప్రొఫెసర్ రాజాఫణి పప్పు అందజేశారు.

జిటెక్ నిపుణులు డాక్టర్ కెవివిఎస్ఆర్.చంద్రమౌళి, గీతం విశిష్ట ప్రొఫెసర్ డాక్టర్ గురజాడ రవికుమార్, జిటెక్ అధికారి సోంబిట్ శాస్త్రి దీన్ని రూపొందించారు. పగటిపూట సూర్యరశ్మిని గ్రహించి సౌరశక్తిని నిల్వచేసి రాత్రివేళ తగు ఉష్ణోగ్రతల మధ్య పంటలను సంరక్షించేందుకు సెన్సార్లు, సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి తక్కువ వ్యయంతో ఉష్ణోగ్రతలను నియంత్రించే ఈ పరికరాన్ని తయారు చేశారు. దీని వినియోగంతో ఆహార ఉత్పత్తుల రంగు, రుచి, వాసనలలో ఏవిధమైన మార్పులు ఉండవని స్పష్టం చేశారు ఈశాన్య రాష్ట్రాలలో అధికంగా పండే వివిధ రకాల చిరు ధాన్యాలు, పసుపు, జీడిపప్పు, గోధుమలు, సన్‌ఫ్లవర్ గింజలు తదితరాలను తేమ లేకుండా పొడి బారేటట్లు చేసి దీర్ఘకాలం నిల్వ చేసుకునేందుకు ఈ పరిజ్ఞానం దోహదపడుతుందన్నారు. వివిధ రకాల పండ్లు, కూరగాయలు, ఔషధ మూలికలను సహితం ఎక్కువ కాలం నిల్వచేసుకోవచ్చన్నారు. ఉపయోగించు కోనేలా చేయవచ్చునని తెలిపారు.

మిజోరామ్ రాష్ట్ర ఉద్యానవన శాఖా మంత్రి ప్రొఫెసర్ లాల్‌నిలావ్‌మా గీతం నిపుణులు రూపొందించిన సాంకేతిక పరిజ్ఞానంతో పంట దిగుబడులకు తేమ వల్ల జరిగే నష్టాలను నివారించి నాణ్యతతో కూడిన ఎగుమతులకు మార్గం కల్పిస్తుందన్నారు. గీతం నిపుణుల మేధో సహకారాన్ని అభినందించారు. తనను కలిసిన గీతం నిపుణుల బృందాన్ని ఈ సాంకేతిక పరిజ్ఞానం విశేషాలను మిజోరామ్ గవర్నర్ డాక్టర్ కె.హరిబాబు అడిగి తెలుసుకున్నారు. విశ్వవిద్యాలయాలోని పరిశోధన ఫలితాలు క్షేత్ర స్థాయిలోఉపయోగపడటం అభినందనీయమన్నారు.

లింగ ఆధారిత హింసకు వ్యతిరేకంగా ర్యాలీ

ప్రజాశక్తి- పద్మనాభం : . లింగ ఆధారిత హింసకు వ్యతిరేకంగా జిల్లాలో మోడల్ మండలంగా ఎంపికైన పద్మనాభంలోని కోరాడ గ్రామంలో బుధవారంవిద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు.సెర్ప్, వెలుగు, ఆర్‌వైఎస్ఎస్ సంయుక్త ఆధ్వర్యాన నిర్వహించిన ర్యాలీలో బాలలపై వేధింపులు, పని ప్రదేశాల్లో లైంగిక వేధింపుల నివారణ, మహిళల అక్రమ రవాణా, బాల్య వివాహాలు, పిల్లలకు నిరంతర విద్య ప్రాముఖ్యత వంటి అంశాలపై వివరించారు. నిర్భయ చట్టంలోని నియమ,. నిబంధనలను వివరించారు. మోడల్ మండలం ఎంఎంటిఎల్ గణేష్, సిహెచ్ఆర్ జెండర్ ఎన్ఎఫ్ఎ చక్రవర్తి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

చోరీ కేసులో నిందితునికి రెండేళ్ల జైలు

ప్రజాశక్తి- విశాఖ లీగల్ : చోరీ కేసులో నిందితుడికి రెండేళ్ల జైలు శిక్ష, రూ.12వేలు జరిమానా విధిస్తూ చీఫ్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ ఎం ప్రదీప్‌కుమార్ బుధవారం తీర్పునిచ్చారు. సీనియర్ అసిస్ట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ మైలపిల్లి ఆదినారాయణ తెలిపిన వివరాల ప్రకారం 2023 జూన్ 6న వన్ టౌన్ ప్రాంతంలోని థామ్సన్ వీధి, బిసి బాలికల హాస్టల్‌లోకి అక్రమంగా ప్రవేశించి, వంట మనిషికి చెందిన ఒకటిన్నర తులాల పుస్తెల తాడుతోపాటు రూ.60వేలు నగదు అపహరించిన కేసులో బాధితురాలు బంటు లక్ష్మీ వన్ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ పి.శ్రీనివాసరావు విచారణ జరిపి, అక్కయ్యపాలేనికి చెందిన ఆకుల శివాజీపై చార్జిషీట్ దాఖలు చేశారు. ప్రాసిక్యూషన్ 454, 380 ఐపిసి సెక్షన్ల కింద కేసు నమోదుచేసి, సమర్పించిన నేరాభియోగాలు రుజువు కావడంతో ఈ మేరకు న్యాయమూర్తి తీర్పునిచ్చారు.

14 కిలోల గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి -నక్కపల్లి :మండలంలోని వేంపాడు టోల్ ప్లాజా వద్ద బుధవారం గంజాయి స్మగ్లర్లను అరెస్టు చేసి, వారి వద్ద నుండి 14 కేజీల గంజాయి స్వాధీన పరుచుకున్నట్లు సిఐ కుమారస్వామి, ఎస్ఐ సన్నిబాబు తెలిపారు. తమిళనాడు రాష్ట్రానికి చెందిన పరమశివం, తిరు మురుగన్ కలిసి జి మాడుగుల ప్రాంతంలో గంజాయి కొనుగోలు చేసుకుని, బస్సులో వెళ్తుండగా వేంపాడు టోల్ ప్లాజా వద్ద అరెస్టు చేశారు. వారితో బాలిక ఉన్నట్లు తెలిపారు.

అధిక వడ్డీ ఆశ చూపి రూ.4 కోట్లతో పరారీ

- పోలీసులకు బాధితుల ఫిర్యాదు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : అధిక వడ్డీ ఆశ చూపించి, సామాన్య మధ్యతరగతి ప్రజల నుంచి సుమారు రూ.4 కోట్లు వసూలు చేసి ఇద్దరు వ్యక్తులు పరారయ్యారు. విశాఖ టూ టౌన్ పోలీసులకు, నగర పోలీస్ కమిషనర్‌కు బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు.... అల్లిపురం 33వ వార్డుకు చెందిన మహిళ మజ్జి ముత్యాలు, అదే ప్రాంతానికి చెందిన సేనాపతి అప్పారావు కలిసి అధిక వడ్డీ ఆశ చూపి, పెద్ద మొత్తంలో డబ్బు వసూలు చేశారు. తన కుమారుడు విదేశాలలో ఉద్యోగం చేస్తున్నాడని అక్కడ అనేకమందికి ఉద్యోగాలు కల్పిస్తున్నాడని నమ్మబలికి ముత్యాలు వసూళ్లకు పాల్పడింది.సొంత ఇల్లు, భర్త ఇద్దరు పిల్లలు ఉన్నప్పటికీ, సేనాపతి అప్పారావుతో కలిసి అక్రమంగా డబ్బు వసూలు చేసి పరారైంది. బాధితులు టూ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసినా స్పందన లేకపోవడంతో బుధవారం సిపికి ఫిర్యాదు చేశామని33వ వార్డు తెలుగు మహిళ అధ్యక్షులు అనంతకుమారి మీడియాకు తెలిపారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి

ప్రజాశక్తి - ఆరిలోవ : జివిఎంసి 12వ వార్డు సూర్యతేజ నగర్‌లో రూ.50 లక్షల జివిఎంసి నిధులతో రిటైనింగ్ వాల్, రహదారులు, ఇతర అభివృద్ధి పనులకు బుధవారం ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు శంకుస్థాపన చేసారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెలగపూడి మాట్లాడుతూ స్మార్ట్ సిటీ అభివృద్ధిలో భాగంగా నియోజకవర్గంలో అన్ని వార్డుల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. పంచగ్రామాల భూసమస్యకు త్వరలో పరిష్కారం లభిస్తుందన్నారు. సూర్యతేజనగర్ నుంచి అంబేద్కర్ కూడలి, అలాగే తోటగరువు నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు రోడ్డు విస్తరణ పనులు పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో జివిఎంసి వర్క్స్ ఎఇఇ వెంకటరావు, వైసిపి నాయకులు రామన్, వార్డు టిడిపి ఇన్‌చార్జ్ ఒమ్మి అప్పలరాజు, అధ్యక్షులు గాడి సత్యం, మద్దిల రాజశేఖర్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన

ప్రజాశక్తి- సీతమ్మధార : జివిఎంసి 46వ వార్డు మధుసూదన్ నగర్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను బుధవారం జోనల్ కమిషనర్ జి రాముతో కల్సి డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్ వార్డులో పర్యటించి పరిశీలించారు. వార్డులో జరుగుతున్న, చేయాల్సిన అభివృద్ధి పనులపై జెడ్‌సితో సమీక్షించారు. వార్డు పరిధిలో పారిశుధ్య పనులను పరిశీలించారు. సమస్యలపై ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. కార్యక్రమంలో తాగునీటి సరఫరా విభాగం డిఇఇ, సెక్షన్ ఎఇఇ ఉమామహేశ్వరరావు, వర్క్ ఇన్‌స్పెక్టర్ నరేష్, సచివాలయ సిబ్బంది కె.చిన్ని, కె.ఈశ్వరరావు, కె.లావణ్య, రామారావు, విజయ లక్ష్మి, శ్రీను పాల్గొన్నారు.

విద్యుత్ ఛార్జీల్లో ఎపి 'టాప్' లేపారు!

• పెంపుపై పునరాలోచించాలి • రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తలు



రౌండ్‌టేబుల్ సమావేశంలో పాల్గొన్న వక్తలు

ప్రజాశక్తి- సీతమ్మధార: స్వర్ణాంధ్ర విజన్ 2047తో రాష్ట్రాన్ని అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు, ఇపుడు ట్రూఅప్, ఇంధన సర్దుబాటు పేరుతో విద్యుత్ ఛార్జీల్లో దేశంలోనే అత్యధికంగా వసూలు చేస్తున్న రాష్ట్రంగా ఎపిని మార్చేశారని పలువురు మేధావులు, సామాజిక వేత్తలు, ఉద్యమ కారులు ఆందోళన వ్యక్తం చేశారు. పెంచిన విద్యుత్ ఛార్జీలపై పునరాలోచించి తగ్గించాలని డిమాండ్ చేశారు. బుధవారం పౌర గ్రంథాలయంలో ఎపి. ఎడిటర్స్ అసోసియేషన్ ఆధ్వర్యాన విద్యుత్ ఛార్జీల పెంపు, స్మార్ట్ మీటర్ల ఏర్పాటుపై రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఎడిటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వివిఆర్ కృష్ణంరాజు ఆధ్వర్యాన జరిగిన సమావేశంలో ఇంధన సర్దుబాటు విద్యుత్ ఛార్జీలను ప్రభుత్వమే భరించాలని, స్మార్ట్‌మీటర్ల ఏర్పాటును నిలిపేయాలని తీర్మానించారు. ఎన్నికల సమయంలో విద్యుత్‌ఛార్జీలు పెంచబోమని, స్మార్ట్‌మీటర్లను బిగించబోమని హామీ ఇచ్చిన సిఎం చంద్రబాబు ప్రజలను మోసగించారని పలువురు వక్తలు విమర్శించారు.

సమావేశంలో జివిఎంసిలో సిపిఎం ఫ్లోర్‌లీడర్, కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు మాట్లాడుతూ, తమిళనాడు తర్వాత అతితక్కువ విద్యుత్‌ఛార్జీల వసూలుతో రెండో స్థానంలో ఉన్న ఎపిని, చంద్రబాబు అధికారంలోకి వచ్చిన తర్వాత ఆరునెలల్లోనే అగ్రస్థానానికి చేర్చేశారని దుయ్యబట్టారు. తమిళనాడులో వందయూనిట్లకు రూ.113 వసూలు చేస్తే, కేంద్ర ప్రభుత్వ విద్యుత్, ఇంధన శాఖ నివేదిక ప్రకారం 2023 మార్చిలో జగన్మోహనరెడ్డి పాలనలో గృహవినియోగానికి అన్నిసుంకాలు కలుపుకుని వంద యూనిట్లకు రూ.321 మాత్రమే వసూలు చేశారన్నారు. అప్పట్లో ఒడిశాలో వందయూనిట్లకు రూ.426, కేరళలో రూ.446, మహారాష్ట్రలో రూ.668, ఉత్తరప్రదేశ్‌లో రూ.693, రాజస్థాన్‌లో రూ. 833 వసూలు చేసేవారన్నారు. అయితే ఎపిలో విద్యుత్‌ఛార్జీల పెంపుతో ఏకంగా అతితక్కువలో రెండోస్థానం నుంచి అత్యధిక ఛార్జీల్లో అగ్రస్థానానికి సిఎం చంద్రబాబు చేసేశారన్నారు. రాష్ట్రంలో ప్రతి విద్యుత్ బిల్లులో 13 రకాల సుంకాలు, పన్నులు చూపిస్తున్నారని మరే రాష్ట్రంలోనూ ఇన్ని రకాల భారాలు లేవన్నారు. రాష్ట్రంలోని కోటి 86 లక్షల మంది విద్యుత్ వినియోగదారులపై స్మార్ట్ మీటర్ల పేరుతో మరో రూ..7200 కోట్ల భారం మోపడానికి ప్రభుత్వం రంగం సిద్ధం చేసిందన్నారు.

సమావేశానికి అధ్యక్షత వహించిన ఎడిటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కృష్ణంరాజు మాట్లాడుతూ, ఇంధన, విద్యుత్ కొనుగోలు వ్యయాల సర్దుబాటు చార్జీల పేరుతో దేశంలో గుజరాత్, కర్నాటక, మధ్యప్రదేశ్‌తోపాటు ఎపిలో మాత్రమే తెరచాటు ఛార్జీల వసూళ్లకు పాల్పడుతూ విద్యుత్ వినియోగదారులపై సగటున యూనిట్‌కు రూ.15 వరకు వసూలు చేయడం దుర్మార్గమన్నారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పి మణి మాట్లాడుతూ, ఎపుడో వాడిన విద్యుత్‌కు ఇపుడు సర్దుబాటు పేరుతో అదనపు ఛార్జీలు వసూలు చేయడం ఎంతవరకు సమంజసమని . రానున్న రోజుల్లో విద్యుత్ ఛార్జీల భారంపై అందరం సమిష్టిగా పోరాటం చేద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రిటైర్డ్ ప్రొఫెసర్ కె తిమ్మారెడ్డి, ప్రజా సంఘాల జెఎసి అధ్యక్షుడు జెటి రామారావు, సామాజికవేత్త సన్ మూర్తి, త్యాగరాజన్, హెల్పింగ్ హ్యాండ్ ప్రతినిధి ఎం.మణి, ఇన్కమ్ టాక్స్ కన్సల్టెంట్ తిలక్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయ, విద్యా సమస్యలపై పోరాడతా

పిడిఎఫ్ ఉత్తరాంధ్ర ఎమ్మెల్సీ అభ్యర్థి విజయగౌరి



ప్రచారంలో పిడిఎఫ్ ఉత్తరాంధ్ర ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల విజయగౌరి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పిడిఎఫ్ అభ్యర్థిగా పోటీచేస్తున్న తనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని, ఎమ్మెల్సీగా గెలిస్తే శాసనమండలిలో ఉపాధ్యాయ వాణిని వినిపించి, విద్యాసమస్యలపై గళం విప్పుతానని పిడిఎఫ్ టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల విజయ గౌరి అన్నారు. బుధవారం ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గ ఎన్నికలలో పిడిఎఫ్ తరపున పోటీ చేస్తున్న కోరెడ్ల విజయగౌరి కంచరపాలెంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ,సాంకేతిక విద్యా విధానంలో వస్తున్న మార్పులు, సమస్యలు, కొత్త కళాశాలలో ఉద్యోగ నియామకాలు వంటి సమస్యలపై పనిచేస్తానన్నారు.పార్టీలు, రాజకీయాలకతీతతంగా పిడిఎఫ్ పనిచేస్తుందన్నారు. పెద్దల సభకు ఎమ్మెల్సీగా తనను పంపాలని కోరారు.

విలువలతో కూడిన విద్య అవసరం



మాట్లాడుతున్న అడిషనల్ కమిషనర్ డివి రమణమూర్తి.

ప్రజాశక- గాజువాక : విలువలతో కూడిన విద్య విద్యార్థులకు అవసరమని జివిఎంసి అదనపు కమిషనర్ డివి రమణమూర్తి అన్నారు. బుధవారం గాజువాక ఎంవిఆర్ కాలేజీలో పిజి విద్యార్థుల ఫ్రెషర్స్‌డే వేడుకలు నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో కళాశాల సెక్రెటరీ వి రామారావు, ప్రిన్సిపల్ ఎ.బాలకృష్ణ, వైస్ ప్రిన్సిపల్ ఎస్‌వి.కృష్ణ, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ వై ఈశ్వరరాజు, రామ్ సన్యాసిరావు పాల్గొన్నారు.

'దూదేకుల' జనగర్జనకు తరలిరండి



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ముస్లిం దూదేకుల సంఘం ప్రతినిధులు

ప్రజాశక్తి- సీతమ్మధార: ఈనెల 20, 21 తేదీల్లో దూదేకుల ముస్లిం ఇండియన్, ముస్లిం మైనారిటీ, ఏపీ నూర్‌భాషా ముస్లిం సంఘం ప్రతినిధుల ప్లీనరీ సమావేశం, జనగర్జనను పెందుర్తి ప్రశాంత్‌నగర్ పోర్టు కల్యాణ మండపంలో జరుగుతుందని రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, ఉత్తరాంధ్ర అధ్యక్షుడు షేక్ సుభాన్, వెల్లడించారు. బుధవారం విశాఖ పౌర గ్రంథాలయంలో దీనికి సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించి, విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఈనెల 21న ఉమ్మడి విశాఖ జిల్లా నూర్‌భాషా, దూదేకుల జనగర్జన పెందుర్తి వుడా లేఅవుట్ పార్కు గ్రౌండ్‌లో జరుగుతుందని, దీనికి రాష్ట్రవ్యాప్తంగా సంఘ ప్రతినిధులు హాజరౌతారన్నారు. ప్లీనరీ, జనగర్జనలో పలు అంశాలపై చర్చించి, కార్యాచరణ రూపొందిస్తామన్నారు. ఉత్తరాంధ్ర కన్వీనర్ షేక్ ఇస్మాయిల్ మాట్లాడుతూ, గర్జనను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సంఘం ప్రధాన కార్యదర్శి షేక్ రెహమాన్, ఏలూరు జిల్లా అధ్యక్షుడు ఇబ్రహీం, ఆహ్వాన కమిటీ ఛైర్మన్ షేక్‌ఖాన్, ఉమ్మడి విశాఖ జిల్లా అధ్యక్షుడు షేక్ బాబ్జీ పాల్గొన్నారు.

విద్యుత్ భారాలపై సిపిఎం నిరసన



విద్యుత్ బిల్లులు దహనం చేస్తున్న కంచరపాలెం సిపిఎం నేతలు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : ట్రూఅప్ పేరుతో పెంచిన విద్యుత్ ఛార్జీలను తగ్గించాలని, స్మార్ట్ మీటర్ల బిగింపును రద్దుచేయాలని కోరుతూ సిపిఎం కంచరపాలెం జోన్ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం నరేంద్రనగర్‌లో విద్యుత్ బిల్లులు దహనం చేశారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యురాలు బి.పద్మ మాట్లాడుతూ రాష్ట్రంలోకూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలపై విపరీతమైన భారాలు మోపారని, అవిచాలవన్నట్లు ఎపుడో వాడిన విద్యుత్‌కు ఇపుడు సర్దుబాటు పేరుతో ఛార్జీలు పెంచడం దుర్మార్గమన్నారు. అదానికి రూ.కోట్లలో లబ్ది చేకూర్చేందుకు స్మార్ట్‌మీటర్లను బిగిస్తున్నారన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీకి కట్టుబడి వెంటనే ఆయా నిర్ణయాలను వెనక్కు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జోన్ నాయకులు ఎం.జయలక్ష్మి, వి.ఉమ, తెలుగు రమణ, పుష్ప, కృష్ణవేణి పాల్గొన్నారు.

పెందుర్తి : సిపిఎం గోపాలపట్నం జోన్ కమిటీ ఆధ్వర్యంలో 96వ వార్డు ఉప్పర కాలనీలో విద్యుత్ బిల్లులు దహనం చేశారు. సిపిఎం సీనియర్ నేత బి.వెంకటరావు మాట్లాడుతూ, పెంచిన విద్యుత్‌ఛార్జీలను తగ్గించకుంటే ప్రజలను సమీకరించి, ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సిఐటియు నాయకులు అప్పలనాయుడు, పద్మ పాల్గొన్నారు.



ఉప్పరకాలనీలో మాట్లాడుతున్న సిపిఎం నేత వెంకటరావు

చట్టానికి లోబడి వ్యవహరించాలి



మాట్లాడుతున్న సిఐ పార్థసారథి

ప్రజాశక్తి -గాజువాక: విదేశాలకు అభ్యర్థులను పంపేటప్పుడు వెల్డింగ్ ఇనిస్టిట్యూట్‌ల యాజమాన్యాలు చట్టాలకు లోబడి పనిచేయాలని గాజువాక సిఐ పార్థసారథి అన్నారు. ఎపి టెక్నికల్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ అభ్యర్థులను పంపేటప్పుడు అవసరమైన తగు జాగ్రత్తలు తీసుకోవాలని, తగిన నైపుణ్యశిక్షణ ఉండేలా చూడాలన్నారు. గాజువాక వెల్డింగ్ ఇనిస్టిట్యూట్‌ల సేవలను కొనియాడారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షులు కరణం కనకారావు, యూనియన్ ప్రధాన కార్యదర్శి సిహెచ్ వెంకటరమణ, ప్రసాద్, బొండా అచ్చిబాబు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్‌పై కేంద్రం మొండి పట్టు విడనాడాలి

ప్రజాశక్తి -ఉక్కునగరం: విశాఖ స్టీల్‌ప్లాంట్‌పై కేంద్రం మొండివైఖరి విడనాడాలని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు డిమాండ్‌చేశారు. విశాఖ ఉక్కు ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ పోరాట కమిటీ ఆధ్వర్యాన కూర్మన్నపాలెంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు బుధవారం 1406వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలో స్టీల్‌ప్లాంట్ డిఎస్ఐయు, టిఎన్‌టియుసి యూనియన్ల నాయకులు, కార్మికులు కూర్చుని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ నాయకులు బొడ్డు పైడిరాజు మాట్లాడుతూ, స్టీల్‌ప్లాంట్ రక్షణ కోసం కార్మికులు ఇంతగా పోరాడుతుంటే కేంద్రం పట్టించుకోక పోవడం అన్యాయమన్నారు. స్టీల్‌ప్లాంట్‌లో యంత్రాలు పాడైపోయి, ఉత్పత్తి తగ్గిపోయి కార్మికులు మనోవేదనకు గురవతున్నారన్నారు. వైజాగ్ స్టీల్‌ప్లాంట్ రక్షణ కోసం ఢిల్లీ వెళ్లి కేంద్ర మంత్రి కుమారస్వామిని కలిసిన ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులకు అభినందనలు తెలిపారు. కేంద్ర మంత్రిని కలవడానికి సహకరించిన సిపిఎం ఎంపీ శివాదాసన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

ఉత్సాహంగా క్రీడాపోటీలు



విజేతలతో సంస్థ ప్రతినిధి సాయిబాబు

ప్రజాశక్తి- సీతమ్మధార: నగరంలోని ఎంవిపి ఏరియాలోని క్రీడామైదానంలో పద్మ పూజిత ఫైనాన్స్, వీల్స్ మార్ట్ ఆధ్వర్యంలో ఆయా సంస్థల ఉద్యోగులకు ఆటల పోటీలు నిర్వహించారు.. వాలీబాల్, స్పీడ్ వాక్, రింగ్ టెన్నికాయిట్, షాట్ పుట్ వంటి పలు క్రీడాంశాలలో సంస్థ ఉద్యోగులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధి సాయిబాబు మాట్లాడుతూ, తమ సంస్థలోని ఉద్యోగులకు ఆటవిడుపుగా ఉభయ తెలుగురాష్ట్రాల్లోని అన్ని బ్రాంచుల్లో ఆటల పోటీలను నిర్వహించినట్లు తెలిపారు. ఉద్యోగ సమయంలో నిత్యం బిజీగా ఉండే తమ సంస్థ ఉద్యోగులు ఎంతో ఉత్సాహంగా పోటీల్లో పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. వారందరికీ సంస్థ తరపున ధన్యవాదాలు తెలిపారు. విజేతలకు బహుమతులు అందజేశారు.

పదో తరగతి మోడల్ పేపర్ల ఆవిష్కరణ

ప్రజాశక్తి - ఆరిలోవ : యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు తయారు చేసిన పదో తరగతి మోడల్ టెస్ట్ పేపర్లను డిఇఒ ఎన్.ప్రేమ్‌కుమార్ బుధవారం జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దాసరి నాగేశ్వరరావు, టిఆర్.అంబేద్కర్‌తో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డిఇఒ ప్రేమ్‌కుమార్ మాట్లాడుతూ యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఆయా సబ్జెక్టుల్లో నిష్ణాతులైన సీనియర్ ఉపాధ్యాయులచే విద్యార్థుల కోసం మోడల్ పేపర్లు తయారు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కోశాధికారి కె.రాంబాబు, జిల్లా సీనియర్ నాయకులు బి.జనార్దనరావు, జిల్లా కార్యదర్శులు మహ్మద్ రిజ్వాన్, టి.జగన్ పాల్గొన్నారు.



టెన్త్ మోడల్ పేపర్లను ఆవిష్కరిస్తున్న డిఇఒ ప్రేమ్‌కుమార్

భూ సమస్యల పరిష్కారంపై

విశ్వాసమివ్వని ప్రాంతీయ సదస్సు

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు లోకనాథం

ప్రజాశక్తి-అనకాపల్లి

ఉత్తరాంధ్ర జిల్లాల ప్రజాప్రతినిధులు, జిల్లా కలెక్టర్లు, ఇతర అధికారులతో రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ విశాఖపట్నంలో నిర్వహించిన ప్రాంతీయ సదస్సు భూ సమస్యలపై ప్రజలకు విశ్వాసం ఇవ్వలేకపోయిందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఉత్తరాంధ్రలో ఉన్న భూ సమస్యలు పరిష్కరించకుండా గత ప్రభుత్వ హయాంలో జరిగిన భూ కుంభకోణాలపై ఎవరికి తోచినట్లుగా వారు సమీక్ష చేశారే తప్ప వాస్తవంగా ఉన్న భూ సమస్యలు ఏమిటి? వాటిని ఎలా పరిష్కరించాలనే లక్ష్యంతో జరగలేదని తెలిపారు. ఉత్తరాంధ్ర జిల్లాలో రెవెన్యూ సదస్సులు ప్రజల భూ సమస్యలు పరిష్కరించే దిశగా జరగటం లేదన్నారు. మొదట ధరఖాస్తులు, వినతులు తీసుకోవడానికి కూడ అధికారులు అంగీకరించలేదని, ప్రజలు తీవ్ర ప్రతిఘటన తరువాత ప్రజల నుండి వినతులు తీసుకున్నారని పేర్కొన్నారు. ఒక్క అనకాపల్లిలో 25వేల భూ సమస్యలకు వినతలు వచ్చాయంటే భూ సమస్య తీవ్రత ఎంత ఉందో అర్ధమౌతోందన్నారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో రెండు సిట్‌లు వేసి నివేదికలు తయారు చేశారని, నేటికీ వాటిని బహిర్గతం చేయలేదని, వాటి గురించి కనీసం ఈ సమావేశంలో ప్రస్తావన లేదని తెలిపారు. భూ కబ్జాదార్లుకు అండగా వుంటుందా? చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటారనేది ప్రశ్నార్ధకంగానే వుందన్నారు. పేదలకు ఇచ్చిన డిఫారం పట్టా భూములు అన్యాక్రాంతమయ్యాయని, వాటి గురించి చర్యల్లేవని పేర్కొన్నారు. తరతరాలుగా ప్రభుత్వ భూముల్లో ఇళ్ల నిర్మాణం, భూ సాగు చేసుకుంటున్న పేదలకు భరోసా ఇవ్వలేదన్నారు. 22ఎ, 388 జివో సక్రమంగా అమలు జరగటం లేదని ప్రజా ప్రతినిధులు ఆవేదన వెల్లబుచ్చారంటే పరిస్థితి ఎలా వుందో అర్ధం చేసుకోవాలన్నారు. ఇప్పటికైనా రెవెన్యూ సదస్సులు భూ వివాదాలు పరిష్కార మార్గాలు చూపాలన్నారు. కోనేరు రంగారావు కమిటీ సిఫార్సులు ప్రకారంగా ప్రతి జిల్లాకు భూ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక ఐఎఎస్ అధికార్లును నియామకం చేసి భూ వివాదాలకు శాశ్వత పరిష్కారాలు చూపాలని సిపిఎం నేత లోకనాథం డిమాండ్ చేశారు.



కార్యక్రమంలో పాల్గొన్న రేణువర్గీష్, కె.అప్పారావు తదితరులు

ఎంఆర్‌ఎఫ్ టైర్స్ అండ్ సర్వీస్ సెంటర్ ప్రారంభం

ప్రజాశక్తి-అచ్యుతాపురం : ఎంఆర్‌ఎఫ్ పరిశ్రమకు చెందిన కార్తీక్ టైర్స్ అండ్ సర్వీస్ సెంటర్‌ను ఎంఆర్‌ఎఫ్ రీజనల్ సేల్స్ మేనేజర్ రేణు వర్గీష్ చేతుల మీదుగా బుధవారం అచ్యుతాపురంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా రేణు వర్గీస్ మాట్లాడుతూ అధునాతన టెక్నాలజీతో ఎంఆర్‌ఎఫ్ కార్తిక్ టైర్స్ సేవలు అందుబాటులో ఉంటాయని ఆయన చెప్పారు. దేశంలో అత్యంత విలువైన టైర్ల బ్రాండ్‌గా ఎంఆర్‌ఎఫ్ ముందుకు సాగుతుందన్నారు. ఉత్తమమైన నాణ్యమైన అన్ని రకాల టైర్లను ఎంఆర్‌ఎఫ్ అందిస్తుందని చెప్పారు. టైర్ల నైట్రోజన్ ఇన్‌ఫ్లేషన్ కూడా సెంటర్‌లో అందించబడుతుందని పేర్కొన్నారు. మొదట సేల్ శివరామరాజుకు టైరును అందించారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌ఎఫ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ విష్ణు సాయి శన, డిప్యూటీ జనరల్ మేనేజర్ ప్రతాప్ వర్మ, ఎంఆర్‌ఎఫ్ సేల్స్ అండ్ సర్వీస్ కార్తీక టైర్స్ యజమాని కూండ్రపు అప్పారావు, ధర్మరెడ్డి గణేష్ తదితరులు పాల్గొన్నారు.

మామిడిపంట బీమా పథకం ప్రీమియం గడువు పెంపు

ప్రజాశక్తి-అనకాపల్లి : వాతావరణ ఆధారిత పంటల బీమా సంబంధించి మామిడి తోటలకు బీమా చేసుకోవడానికి డిశంబరు 31 వరకు గడువు పొడిగించినట్లు జిల్లా ఉద్యానశాఖాధికారి జి.ప్రభాకరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రీమియం చెల్లింపు వలన 2024-25 రబీ సీజన్‌కు బీమా వర్తిస్తుందని చెప్పారు. జిల్లాలో ఇ-పంటలో నమోదు చేయుంచుకున్న రైతులందరూ 2024-25 సంవత్సరం పంటకు బీమా ప్రీమియం చెల్లించుటకు అర్హులని పేర్కొన్నారు. దీనిని గ్రామ వ్యవసాయ లేదా ఉద్యాన సహాయకుల వద్ద తీసుకున్న పంట నమోదు పత్రం, ఆధార్ కార్డు కాపీ, బ్యాంకు అకౌంట్ కాపీ, 1బి/పట్టాదారు పాస్ పుస్తకం కాపీతో సహా ఇన్సురెన్స్ ప్రీమియం మామిడిపంటకు ఎకరానికి 2200 రూపాయలు చొప్పున డిశంబరు 31వ తేదీలోగా దగ్గరలో ఉన్న మీ-సేవా కేంద్రంలో ప్రీమియం చెల్లించాలని కోరారు.

20న విద్యుత్ అంతరాయం

ప్రజాశక్తి-అనకాపల్లి : 132కేవీ సబ్ స్టేషన్ మరమ్మతుల కారణంగా తుమ్మపాల సెక్షన్ పరిధి తుమ్మపాల, అల్లిఖానుడిపాలెం సబ్ స్టేషన్ పరిధిలో ఉన్న గ్రామాల్లో ఈనెల 20న ఉదయం 7 గంటల నుండి రాత్రి 7 గంటల వరకు వ్యవసాయ విద్యుత్ సరాఫరా నిలిపివేయడం జరుగుతుందని, వినియోగదారులు సహరించాలని కసింకోట ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్ రామకృష్ణ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు.

డైట్‌లో ముగిసిన వర్క్‌షాప్

ప్రజాశక్తి-అనకాపల్లి

స్థానిక డైట్ ఇంజనీరింగ్ కళాశాలలో డేటావేలీ ఆధ్వర్యంలో దేవోప్స్ నిర్వహించిన వర్కుషాప్ బుధవారం ముగిసింది. మూడు రోజుల పాటు సిఎస్‌డి, సిఎస్ఎమ్ విద్యార్థులకు జరిగిన ఈ వర్కుషాపులో మాన్యూల్ ప్రొసెస్‌ని ఎలా ఆటోమేట్ చేయాలో సి.ఎస్.డి విభాగాధిపతి అడపా వెంకటేశ్వరావు తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.వైకుంఠరావు మాట్లాడుతూ ఈ సర్టిఫికేషన్ కోర్స్ వారి భవిష్యత్తులో ఉద్యోగ అవకాశాలకు ఎంతగానో ఉపయోగపడతాయని చెప్పారు. రిసోర్స్ పర్సన్స్ చుంచు శ్రీనివాస్, షేక్ సూరజ్ అపాచీ, మావెన్, అపాచీ టామ్కాట్, జెంకిన్స్ వంటి వివిధ సాంకేతికతనీ నేర్పించామని పేర్కొన్నారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జె ప్రసాద్ రెడ్డి జావా కోడ్‌తో అప్లికేషన్ డెవలప్మెంట్‌ని ఎలా చేయాలో తెలిపారు. అకాడమిక్ కోఆర్డినేటర్ ఏ కృష్ణనాగ్, ఏడబ్ల్యూఎస్ - క్లౌడ్ ని ఎలా వాడాలి, ఈ వర్కుషాప్ ద్వారా నైపుణ్యాలను పెంచుకున్నామని, లాంచింగ్ ఆప్స్ నేర్చుకున్నామని విద్యార్థులు పేర్కొన్నారు. దాడి ఇన్స్టిట్యూట్ చైర్మన్ దాడి రత్నాకర్ కోర్స్ పూర్తి చేసిన విద్యార్థులకు అభినందనలు తెలిపారు.

త్వరితగతిన కేసులు పరిష్కరించాలి

ఎస్‌పి తుహిన్ సిన్హా

ప్రజాశక్తి-అనకాపల్లి

పోలీస్ అధికారులు త్వరితగతిన కేసులు పరిష్కరించేందుకు కృషి చేయాలని ఎస్పీ తుహిన్ సిన్హా ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో బుధవారం నెలవారీ నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. దర్యాప్తులో ఉన్న సాధారణ, తీవ్రమైన, ముఖ్యమైన కేసులు, ప్రాపర్టీ కేసులు, పోక్సో యాక్ట్ కేసులు, 174 సిఆర్‌పిసి/ 194 బిఎన్ఎస్ఎస్ కేసులు, గంజాయి కేసులు, మిస్సింగ్ కేసులను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సమీక్షించి, ఆయా కేసుల్లో దర్యాప్తు పెండింగులో ఉండడానికి గల కారణాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. త్వరితగతిన దర్యాప్తు పూర్తి చేయడానికి పలు సూచనలు చేశారు. మహిళలు/చిన్నారుల సంబంధిత ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలని, పోలీస్ శాఖపై నమ్మకం పెంపొందించేలా సేవలు అందించాలని కోరారు. మిస్సింగ్ కేసుల చేధన, రోడ్డు ప్రమాదాలు, సైబర్ మోసాలు, చోరీలు, మత్తు పదార్థాల నివారణపై దృష్టి పెట్టాలని ఆదేశించారు. పిజిఆర్ఎస్ పిటిషన్లను అధిక ప్రాధాన్యతతో బాధితులకు సత్వర న్యాయం జరిగేలా పరిష్కరించాలని కోరారు. రౌడీ షీటర్లపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని, విజిబుల్ పోలీసింగ్ నిర్వహిస్తూ, ఎన్ఫోర్స్మెంట్ కేసులు ఎక్కువ నమోదు చేయాలని కోరారు. అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కు పాదం మోపాలన్నారు. ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి ప్రాపర్టీ నేరాల్లో నిందితులను త్వరగా చేధించి, రికవరీ శాతాన్ని పెంచాలన్నారు. జిల్లాని గంజాయి రహిత జిల్లాగా మార్చడానికి అందరూ కృషి చేయాలని సూచించారు. సైబర్ క్రైమ్ నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి దర్యాప్తు అధికారులు నేరస్తులను గుర్తించి అరెస్టు చేయాలన్నారు. ఈ సమావేశంలో ప్రతిభ కనబరిచిన 30 మంది అధికారులు, సిబ్బందికి ప్రశంసా పత్రాలు, నగదు చెక్కులతో ఎస్పీ తుహిన్ సిన్హా సత్కరించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు ఎం.దేవప్రసాద్, ఎల్ మోహన్‌రావు, డిఎస్‌పిలు ఎం శ్రావణి, కెవి.సత్యనారాయణ, జిఆర్ఆర్.మోహన్, బి.అప్పారావు, ఈ శ్రీనువాసులు, పి.నాగేశ్వరరావు, ఇనస్పెక్టర్‌లు లక్ష్మణమూర్తి, బాలసూర్యారావు, రమేష్, గఫూర్, టి లక్ష్మి, టి కళ్యాణి, ఎస్సైలు ప్రసాదరావు, బి సురేష్‌బాబు, డి వెంకన్న, జిల్లాలోని సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్‌పి తుహిన్ సిన్హా

రంజన్ మిశ్రా కమిటీకి వినతుల వెల్లువ

ప్రజాశక్తి-విలేకర్ల యంత్రాంగం

షెడ్యూల్డ్ కులాల ఉప వర్గీకరణపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నియమించిన ఏకసభ్య కమిషన్ చైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రా విశాఖ జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం షెడ్యూల్ కులముల వర్గీకరణపై ప్రజలు, ఉద్యోగులు, వివిధ కుల సంఘ నాయకుల నుంచి అభిప్రాయాలు, వినతులు స్వీకరించారు.

చోడవరం : రెల్లి కులస్తులకు ఐదు శాతం రిజర్వేషన్ కల్పించాలని రంజన్ మిశ్రాకు రెల్లి హక్కుల రిజర్వేషన్ పోరాట సమితి నాయకులు వినత పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎర్రంశెట్టి పాపారావు మాట్లాడుతూ ఎస్సీలో రెల్లి కులస్తులు అన్ని రంగాలలో వెనుకబడ్డారని, రిజర్వేషన్లలో అన్యాయం జరగకుండా 5 శాతం రిజర్వేషన్ కల్పించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు వై.వరప్రసాద్, అప్పలరాజు, బంగారి రాజు, ఇళ్లకు బిన్నీసులు, భూపతి నాని, కోన అప్పారావు, దుర్గేశ్వరరావు, గోవిందు పాల్గొన్నారు.

సబ్బవరం : రాష్ట్ర ప్రభుత్వం ఎస్‌సి వర్గీకరణను రాష్ట్ర యూనిట్‌గా తీసుకొని చేయాలని ఎంఆర్‌పిఎస్ అనకాపల్లి జిల్లా మాజీ అధ్యక్షులు గోటివాడ సామ్రాట్ కుమార్, ఉత్తరాంధ్ర జిల్లాల రీజినల్ కోఆర్డినేటర్ ఇండుగుబిల్లి దేముడుబాబు కోరారు. ఈ మేరకు రాజీవ్ రంజన్ మిశ్రాకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎంఆర్‌ఎస్‌పి నాయకులు ఎలుసూరి ఘాటీలు, మోర్త శ్రీనివాస్, మంజేటి రాజబాబు, మారేడుబూడి సతీష్, గోటివాడ సుభాషిణి, వంగలపూడి గణేష్, కె.నరసింహారావు, అనిల్, అశోక్ కుమార్ పాల్గొన్నారు.

దేవరాపల్లి : వర్గీకరణ తీర్పు రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని, కమిషన్ ఏర్పాటుకు చట్టబద్ధత లేదని రాజీవ్ రంజన్ మిశ్రా కమిటీకి దళిత సంఘాలు అభ్యంతరం తెలిపాయి. ఈ మేరకు విశాఖపట్నం కలెక్టర్ కార్యాలయంలో దళిత సంఘాల నుంచి వినతి పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో నాయకులు కాటపల్లి అప్పారావు, కార్లి సాయిసుందరరావు, పతివాడ నాగభూషణం, గొల్ల ఈశ్వరరావు, ఎల్ల రాంబాబు, రిట్టపల్లి పెంటయ్య, వెలమర విష్ణు తదితరులు పాల్గొన్నారు.

వడ్డాది : ఎస్సీ వర్గీకరణపై ప్రభుత్వం నిర్ణయం మార్చుకోకుంటే ఉద్యమిస్తామని జై బీమ్ అధ్యక్షుడు బూసి కోటి అన్నారు. ఈ మేరకు ఎస్సీ వర్గీకరణపై రాజీవ్ రంజన్ మిశ్రా కమిషన్‌కు వినతిపత్రం ఇచ్చారు. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును తాము వ్యతిరేకిస్తున్నామన్నారు.

నర్సీపట్నం టౌన్ : రెల్లి కులస్తులు అన్ని రంగాల్లో వెనుకబడి ఉన్నారని వారికి రిజర్వేషన్లు కల్పించాలని రెల్లి హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు పాపారావు కోరారు. బుధవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, రిజర్వేషన్ లు కల్పించాలని విశాఖపట్నం కలెక్టర్ ఆఫీసులో ఏకసభ్య కమీషన్ చైర్మన్ రంజన్ మిశ్రాకు వినతి పత్రాన్ని అందించామన్నారు. రిజర్వేషన్ ఫలాలకు దూరమై దుర్భర జీవితం అనుభవిస్తున్న రెల్లీలకు రిజర్వేషన్ శాతం పెంచాలని కోరామన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు వైవర ప్రసాద్, అప్పలరాజు, బంగారు రాజు, భూపతి నాని, కోన అప్పారావు, దుర్గేశ్వరరావు, గోవిందు పాల్గొన్నారు.

విశాఖ కలెక్టరేట్ : ఎస్‌సి వర్గీకరణ అమలు కోసం రాష్ట్ర ప్రభుత్వం నియమించిన రాజీవ్ రంజన్ ఏక సభ్య కమిషన్ బుధవారం విశాఖ కలెక్టర్ కార్యాలయంలో దళిత సంఘాల నుంచి వినతి పత్రాలు స్వీకరించింది. ఈ సందర్భగా విదసం భాగస్వామ్య సంఘాలు భీమ్ సేన వార్, ఎఐడిఆర్‌ఎఫ్, దళిత సేన తదితర సంఘాలు వర్గీకరణ తీర్పులోని అంశాలపై రాజ్యాంగ పరమైన అభ్యంతరాలను కమిషన్‌కు రాత పూర్వకంగా సమర్పించారు. ఎస్‌సి వర్గీకరణను అనుమతిస్తూ ఆగస్టులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ఆర్టికల్ 341కి విరుద్ధం అని, ఆ తీర్పు అమలుకు రాష్ట్ర ప్రభుత్వం వేసిన ఏకసభ్య కమిషన్‌కు కూడా చట్ట బద్ధతలేదని జాతీయ ఎస్‌సి కమిషన్ అనుమతి లేని కమిషన్ల సిఫార్సులు చెల్ల నేరవని విదసం ఐక్య వేదిక ఆధ్వర్యాన దళిత సంఘాలు అభ్యంతరం వ్యక్తంచేశాయి. ఈ కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు బూసి వెంకట రావు, భీమ్ సేన నాయకులు చిన్నారావు, జాజి ఓంకార్, గొల్లమాల అప్పారావు, ఎఐడిఆర్‌ఎఫ్ నేత వేణుగోపాల్, సోడదాసి సుధాకర్, బంటు కృష్ణారావు, రవి సంతోష్, గుడాల ఈశ్వర రావు, మాటూరు శ్రీనివాసరావు, వసంత రాజేంద్రప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌సి వర్గీకరణ రాజకీయ కుట్ర అని మాలమహానాడు జాతీయ అధ్యక్షులు డాక్టర్ సిఎం.మంగరాజు ఆరోపించారు. కలెక్టరేట్‌లో కమిషన్‌కు వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ఎస్‌సిలను ఎబిసిడిలుగా రాష్ట్ర పరిధిలో విభజించడం రాజ్యాంగ విరుద్ధమని సుప్రీంకోర్టు 2004లో తీర్పునిచ్చిందని, ఇప్పుడు అదే న్యాయస్థానం ఎస్‌సి, ఎస్‌టిలను రాష్ట్రాల పరిధిలో చేసుకోవచ్చునని తీర్పు ఇచ్చిందని తెలిపారు. హైదరాబాద్ లో జరిగిన మాదిగల సభలో దేశ ప్రధాని నరేంద్ర మోడీ పాల్గొని మాదిగలకు న్యాయం చేస్తానని, ఎస్‌సి వర్గీకరణ చేయిస్తానని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. క్రిమిలేయర్‌ను అమలు పరచడానికి తాము వ్యతిరేకం అన్నారు.

వేపగుంట : రాష్ట్ర యూనిట్‌గా ఎస్‌సి వర్గీకరణ అమలుచేయాలని కోరుతూ ఎమ్మార్పీఎస్ ఉత్తరాంధ్ర రీజనల్ కో-ఆర్డినేటర్ ఐడి బాబు మాదిగ నేతృత్వంలో విశాఖ జిల్లా అధ్యక్షుడు పలసపల్లి ఆదినారాయణ మాదిగ, అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు చిన్నం నాగరాజు ఆధ్వర్యాన రాజీవ్ రంజన్ మిశ్రాకు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో గొట్టిపాటి సుభాషిని, వంగలపూడి గణేష్, కండేల నరసింహారావు, అనిల్, అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతానికి కార్మికుడు మృతి

- మృతుని కుటుంబానికి రూ.50 లక్షలు

నష్టపరిహారం చెల్లించాలని సిఐటియు డిమాండ్

ప్రజాశక్తి-రాంబిల్లి : మండలంలోని మన్యపు చింతువ నేవీ కాలనీ చుట్టూ ఎన్ఎఓబి నిర్మాణ పనులు చేస్తున్న డిఆర్‌డిఓ, పరిధిలో సబ్ కాంట్రాక్టర్ అయినా దొరాజియా కంపెనీలో విద్యుత్ షాక్‌తో పరవాడ గ్రామానికి చెందిన బండారు నీలబాబు (39) మృతి చెందారు. దొరాజియా కంపెనీలో ఫోర్‌మెన్‌గా పనిచేస్తున్న నీలబాబు విద్యుత్ సాకుగురై కన్స్ట్రక్షన్ ప్రాంతంలోనే చనిపోయారు. మృతదేహాన్ని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు జి దేముడు నాయుడు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్ఎఓబి నిర్మాణ పనుల్లో అనేకసార్లు ప్రమాదాలు జరుగుతున్నాయని, కార్మికులకు, ఉద్యోగులకు భద్రత లేకపోవడం వల్లనే ఇటువంటి ప్రమాదాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. కంపెనీ యాజమాన్యాలు వారి లాభాలే చూసుకుంటున్నారు తప్ప, కార్మికుల రక్షణ కోసం ఆలోచించడం లేదని మండిపడ్డారు. ఈ సమస్యలపై అనేకమార్లు సెంట్రల్ లేబర్ అధికారులకు విన్నవించినా పట్టించుకున్న పాపాన పోలేదని పేర్కొన్నారు. మృతుని కుటుంబానికి రూ.50 లక్షలు నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఇటువంటి ప్రమాదాలు జరగకుండా నివారణ చర్యలు చేపట్టాలని, నిర్లక్ష్యంగా వ్యవహరించిన, డిఆర్‌డిఓ, దొరాజియా కంపెనీలపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని కోరారు.

పర్యావరణానికి ఉపయోగపడే మొక్కలు పెంచాలి

ప్రజాశక్తి-బుచ్చెయ్యపేట : పర్యావరణానికి ఉపయోగపడే అడవి జాతి మొక్కలను పెంచాలని విజిలెన్స్ పిసిసిఎఫ్ అధికారి ఎస్ఎస్ శ్రీధర్ సూచించారు. మండలంలోని కసింకోట -బంగారు మెట్ట రోడ్డులో బంగారు మెట్ల జంక్షన్ నుండి వెదురు గడ్డ వరకు రోడ్లకు ఇరువైపులా ఎవెన్యూ ప్లాంటేషన్‌లో భాగంగా గత ఏడాది నాటిన మొక్కలను ఆయన బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మొక్కల వివరాలను రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో విశాఖపట్నం సర్కిల్ ఫారెస్ట్ ఆఫీసర్ మహమ్మద్ దివాన్ మైదిన్, అనకాపల్లి టెరిటోరియల్ డిఎఫ్ఓ ఎం శామ్యూల్, అనకాపల్లి సోషల్ ఫారెస్ట్ డిఎఫ్ఓ గంప లక్ష్మణ్, చోడవరం రేంజ్ ఆఫీసర్ పివి రవివర్మ, జగదీష్ సిబ్బంది పాల్గొన్నారు.

భవిత కేంద్రాన్ని సందర్శించిన ఎన్‌టిపిసి బృందం

ప్రజాశక్తి-పరవాడ : పరవాడ భవిత కేంద్రాన్ని ఎన్టిపిసి ఎస్‌బిఇఎం టీమ్ వినీత్ శర్మ, క్వాలిటీ ఛాంపియన్ పంకజ్ మిట్టల్, సింహాద్రి ఎన్టిపిసి సిఎస్ఆర్ టీమ్ కె.ప్రకాశరావు, ఎగ్జిక్యూటివ్ మేనేజర్ శివం సింగ్ బుధవారం సందర్శించారు. వికలాంగులు, వారి విద్యా ప్రమాణాలు, వారి యొక్క కార్యక్రమాల గురించి నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో భాగంగా వికలాంగులకు రగ్గులు పంపిణీ చేశారు. వికలాంగ విద్యార్థులకు షేక్ బీబీ భోజనం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్టిపిసి సిఎస్ఆర్ మేనేజర్ కె ప్రకాశరావు, పరవాడ సర్పంచ్ సిరిపురపు అప్పలనాయుడు, ఎంఈఓ - 2 సాయి శైలజ, భవిత ఉపాధ్యాయులు టి కుమారి, జి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రమేష్‌కు అభినందనలు

ప్రజాశక్తి-కశింకోట : అనకాపల్లి ఎన్‌టిఆర్ వైద్యాలయం డైరెక్టర్‌గా నియమితులైన కశింకోట మండలం తాళ్ళపాలెం గ్రామ టిడిపి అధ్యక్షులు ఉల్లింగల రమేష్‌ను ఆయన నివాసంలో బుధవారం పలువురు అభినందించారు. రాష్ట్ర తెలుగు రైతు అధికార ప్రతినిధి గొంతిని శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కొంద్రపు రాములనాయుడు, ఉగ్గిని రమణమూర్తి, నైనముశెట్టి రమణరావు, బలిజ ముసిలి నాయుడు, ఒమ్మి కోటేశ్వరరావు, తురకలపూడి రాజబాబు, నారిపిల్లి ప్రసాద్, మందపల్లి శివ, ఆంధ్ర ప్రసాద్, నక్క సాయి పాల్గొన్నారు.

అయ్యప్పస్వామి తిరువీధి ఉత్సవం

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి నర్సింగరావు పేటలోని ప్రముఖ పారిశ్రామిక వేత్త ముత్యాల వెంకటేశ్వర రావు (ఎంవిఆర్) నివాసం వద్ద అయ్యప్ప స్వామి తిరువీధి ఉత్సవం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంవిఆర్ మాట్లాడుతూ అయ్యప్ప మాలధారణ ఆధ్యాత్మికం ఆరోగ్యదాయకమని పేర్కొన్నారు. అనంతరం ఎంవిఆర్ శిరసున ఇరుముడి ధరించి శబరిమలై యాత్రకు బయలు దేరారు. ఎంవిఆర్‌కు అతని తల్లి దండ్రులు, భార్య, కుమారులు రాజేష్, సతీష్, కుటుంబసభ్యులు, బంధువులు, ఎంవిఆర్ సేవాసంఘం, ఎంవిఆర్ యూత్ సభ్యులతో పాటు అభిమానులు పెద్ద ఎత్తున ఆత్మీయ వీడ్కోలు పలికారు. తదనంతరం కార్ల వాహనశ్రేణితో ఎంవిఆర్ విశాఖ విమానాశ్రయానికి చేరుకొని విమానంలో శబరిమల బయలుదేరి వెళ్లారు.

భరిణికం గ్రామంలో డయేరియా

వాంతులు, విరేచనాలతో 13 మంది ఆసుపత్రిలో చేరిక



భరిణికం గ్రామాన్ని సందర్శించిన ఆర్‌డిఓ, ఇతర అధికారులు

ప్రజాశక్తి-పరవాడ

మండలంలోని భరిణికం గ్రామంలో డయేరియా ప్రబలింది. వాంతులు, విరోచనాలతో 13 మంది వివిధ హాస్పిటల్ చికిత్స పొందుతున్నారు. బుధవారం వాంతులు, విరోచనాలు రావడంతో పరవాడ పిహెచ్‌సిలో 13 మంది చేరారు. వారిలో కొంతమందికి ఆరోగ్యం ఇబ్బందిగా ఉండటంతో అనకాపల్లి ఎన్టీఆర్‌కి ఆరుగురిని, విశాఖలోని కేర్ హాస్పిటల్‌కి ఇద్దరిని తరలించారు. పరవాడ పిహెచ్‌సిలో ఇద్దరు చికిత్స పొందుతున్నారు. పరవాడ పీహెచ్సీ నుండి ఇద్దరు డిశ్చార్జి అయ్యారు. విషయం తెలుసుకున్న అనకాపల్లి ఆర్డీవో అయిషా, డిప్యూటీ డిఎంహెచ్ఓ, ఆంధ్ర యూనివర్సిటీ మెడికల్ టీం గ్రామంలో సందర్శించారు. హాస్పటల్‌లో ఉన్న రోగులను పరామర్శించి రోగుల మలం, మూత్రం, గ్రామాల్లో ఉన్న మంచినీటి శాంపిల్ సేకరించి పరీక్షల నిమిత్తం తరలించారు. పూర్తి సమాచారం మరో 48 గంటల్లో తెలియజేస్తామని డిఎంహెచ్వో, ఆర్డీవో, ఇతర అధికారులు తెలిపారు.

డయేరియా బాధితులకు సిఐటియు నేతల పరామర్శ

మండలంలోని భరిణికం గ్రామంలో డయేరియా వ్యాధితో పరవాడ ఆసుపత్రిలో చేరిన బాధితులను సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ, వివి శ్రీనివాసరావు బుధవారం పరామర్శించారు. అనంతరం భరిణికం గ్రామంలో పర్యటించి పరిసరాలను పరిశీలించి గ్రామస్తులతో మాట్లాడి డయేరియాకు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. రాంకీ యాజమాన్యం మెల్లోడు గెడ్డలో రసానికి వ్యర్థ జలాలను విడిచి పెట్టడం వలన తీవ్రమైన కాలుష్యంతో భూగర్భ జలాల నాశనమై పక్కనే ఉన్న భరిణికం గ్రామం ప్రజల అనారోగ్యాలు బారిన పడుతున్నారని సిఐటియు నాయకులు పేర్కొన్నారు. ఇప్పటికే పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు మెల్లోడు గెడ్డలో కాలుష్యం తీవ్రమైందని నివేదిక ఇచ్చారని, దీని ఆధారంగా రాంకీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని, భరిణికం, పరవాడ తానాం, తాడి ప్రజల ఆరోగ్యాలు కాపాడాలని కోరారు. భరిణికం గ్రామంలో డయేరియాకి గురైన వారికి మెరుగైన వైద్య సాయం చేయడంతో పాటు గ్రామంలో జిల్లా మెడికల్ టీంతో వైద్య శిబిరం నిర్వహించాలని వారు డిమాండ్ చేశారు.



డయేరియా బాధితుడిని పరామర్శిస్తున్న సిఐటియు నేతలు

రైతులు అప్రమత్తంగా ఉండాలి

జాయింట్ కలెక్టరు ఎం.జాహ్నవి

ప్రజాశక్తి-అనకాపల్లి : తుపాను కారణంగా అనకాపల్లి జిల్లాలో భారీ వర్షాలు కురిస్తాయన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవి అన్నారు. ముఖ్యంగా జిల్లాలో వరి సాగుచేసిన రైతులు రాబోవు రెండు మూడు రోజుల్లో వరి కోతలు వాయిదా వేసుకోవాల్సిందిగా కోరారు. కోతలు కోసి కళ్ళాల్లో ఉన్న ధాన్యం రక్షణకు ఇప్పటికే 600 టార్పాలిన్లను అవసరమైన రైతులకు పంపిణీ చేశామని తెలిపారు. ఇంకా అవసరమైన టార్పాలిన్ లు కొనుగోలు చేసి అందించడం జరుగుతుందన్నారు. వర్షాలు కారణంగా ధాన్యం విక్రయంలో ఎలాంటి ఇబ్బందులు ఎదురైన నేరుగా జిల్లా కంట్రోల్ రూమ్ నెంబర్లు 8008901584, 9492821030కి ఫిర్యాదు చేయవచ్చునని తెలిపారు. జిల్లాలో ఇప్పటివరకు 406.16 మెట్రిక్ టన్నులు ధాన్యం 124 మంది రైతుల దగ్గర కొనుగోలు చేయడం జరిగిందని, 117 మంది రైతుల ఖాతాలో 87లక్షల రూపాయలు జమ చేయడం జరిగిందని తెలిపారు. రైతులు దళారులను నమ్మి తక్కువ ధరకు తమ ధాన్యాన్ని అమ్ముకోకూడదని విజ్ఞప్తి చేసారు. ప్రభుత్వానికి ధాన్యం అమ్మదలచిన రైతులు దగ్గరలో ఉన్న ధాన్యం కొనుగోలు కేంద్రాలు (ఆర్ఎస్‌కె) లను సంప్రదించాలని జాయింటు కలెక్టరు సూచించారు.

వరి కోతలు వాయిదా వేయాలి

ప్రజాశక్తి-కశింకోట

రాగల మూడు రోజులు వరకు తుఫాన్ హెచ్చరికలు జారీ చేసిన నేపథ్యంలో రైతులందరూ వరి పంట కోతలు నిలిపివేయాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బి.మోహన్‌రావు సూచించారు. మండలంలోని వెదురుపర్తి గ్రామంలో బుధవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. పంట పొలాల్లో రైతులతో సంభాషించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోసిన పన్నలను వీలైనంతవరకు కుప్పలుగా పెట్టుకొని టార్పలిన్లు కప్పుకోవాలన్నారు. వరి పనలు తడిస్తే మొలకెత్తకుండా ఉప్పునీటి పిచికారీ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారిని ఎం.స్వప్న, గ్రామ వ్యవసాయ అధికారి లక్ష్మీ సింధుజ, ముక్క పాండురంగ, వెలుగుల ఈశ్వరుడు, మదిని నాయుడు, కోన అప్పారావు రైతులు పాల్గొన్నారు.

అనకాపల్లి : మండలంలోని మార్టూరు గ్రామంలో నిర్వహించిన పొలం పిలుస్తుంది కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి రంగాచారి పాల్గొని మాట్లాడారు. తుఫాను నేపథ్యంలో రైతులందరూ తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మార్టూరు వ్యవసాయ సహాయకులు దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

గొలుగొండ : మండలంలోని పాకలపాడు, పీజీ.పేట గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడిఏ టి.శ్రీదేవి మాట్లాడుతూ, తుపాన్ ప్రభావం తగ్గేంత వరకు వరి కోతలను, నూర్పులను వాయిదా వేసుకోవాలన్నారు. కోసిన వరి పంటను చిన్నచిన్న కుప్పలుగా పెట్టుకొని టార్పాలిన్లు కప్పుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ వసంత, విహెచ్ఏ దేవి, ఎంపీఈఓ కె.శివ రైతులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండలంలోని కలిగొట్ల పిఎసిఎస్ వద్ద బుధవారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలిగొట్ల కోపరేటివ్ సొసైటి సీనియర్ ఇన్స్పెక్టర్ పి.గుణసుందర్రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యం రైతులు దళారుల చేతిలో మోసపోవద్దని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో రైతులు ధాన్యాన్ని విక్రయించాలని కోరారు. ప్రస్తుతం 100 కేజీల ధాన్యానికి 2300 రూపాయలు ప్రభుత్వం చెల్లిస్తుందని, ధాన్యం వేసిన 48 గంటల్లో ఆ రైతు ఖాతాలోకి సొమ్ము జమ చేయడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో నియోజకవర్గ రైతు సంఘ ఆర్గనైజింగ్ సెక్రటరీ కడిమి నాగేశ్వరరావు సీఈవో, రుత్తల వెంకటరావు, పిఎసిఎస్ మాజీ డైరెక్టర్ జి నారాయణరావు, మళ్లిరెడ్డి రాజినాయుడు, క్లస్టర్ ఇంచార్జ్ దొగ్గ నాయుడు బాబు, నీటి సంఘం అధ్యక్షులు జి సిమ్మి నాయుడు, విడుదల సత్యారావు, వ్యవసాయ శాఖ సిబ్బంది ఎం పైడితల్లమ్మ, పిఎసిఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

21న విద్యుత్తు వినియోగదారుల పరిష్కార వేదిక

ప్రజాశక్తి-అనకాపల్లి : ఈనెల 21న నిర్వహించనున్న విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదికలో వినియోగదారులు తమ సమస్యలు తెలియజేయవచ్చని ఏపీఈపీడీసీఎల్ కసింకోట డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కసింకోట సబ్ డివిజన్ కొత్తూరు సెక్షన్ కార్యాలయంలో విశ్రాంత న్యాయమూర్తి, సి జి ఆర్ ఎస్ చైర్మన్ బి సత్యనారాయణ అధ్యక్షతన జరిగే ఈ కార్యక్రమంలో వినియోగదారుల అపరిష్కృత సమస్యలు దృష్టికి తీసుకురావాలని ఈఈ రామకృష్ణ కోరారు.

20న జాతీయ సఫాయి కర్మచారి కమిషన్ సభ్యులు రాక

ప్రజాశక్తి- అనకాపల్లి : జాతీయ సఫాయి కర్మచారి కమిషన్ సభ్యులు పీపీ వావా ఈ నెల 20న జిల్లాలో పర్యటించనున్నట్లు జిల్లా కలెక్టరు విజయ కృష్ణన్ తెలిపారు. డిశంబరు 19వతేదీ రాత్రి అనకాపల్లి చేరుకొంటారని, డిశంబరు 20వ తేది శుక్రవారం ఎస్ఆర్.శంకరన్ సమావేశమందిరంలో మధ్యాహ్నం 12 గంటలకు మునిసిపల్ అధికారులతోను, అనంతరం జిల్లా అధికారులు, బ్యాంకు అధికారులు, సఫాయి కర్మచారుల సంఘ ప్రతినిధులతో సమావేశం నిర్వహిస్తారని పేర్కొన్నారు.

సిపిఎం జిల్లా మహాసభను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి-సబ్బవరం : నర్సీపట్నంలో ఈ నెల 20, 21, 22 తేదీలలో జరగనున్న సిపిఎం అనకాపల్లి జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.ప్రభావతి పిలుపునిచ్చారు. ఈ మేరకు మండల కేంద్రంలో బుధవారం ప్రచారం చేపట్టారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు ఉప్పాడ సత్యవతి, కె.కోటేశ్వరరావు, పి.కాసులమ్మ తదితరులు పాల్గొన్నారు.

చోడవరం : సిపిఎం జిల్లా మహాసభల వాల్ పోస్టర్‌ను బుధవారం మండల కేంద్రంలో ఆ పార్టీ నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిపిఎం చోడవరం మండల నాయకులు ఎన్వీ నాయుడు మాట్లాడుతూ అనకాపల్లి జిల్లా సమగ్ర అభివృద్ధి కోసం, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపైనా మహాసభలో చర్చించి పోరాటాల రూపకల్పన చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో ముఠా కార్మిక సంఘం కార్యదర్శి జోగా రాము, పి సత్తిబాబు, రాజు, శ్రీను, నూకరాజు పాల్గొన్నారు.

కె.కోటపాడు : మండలంలోని ఆనందపురం జంక్షన్‌లో సెంటర్లో బుధవారం ఆటో యూనియన్ నాయకులు, డ్రైవర్లతో కలిసి సిపిఎం నాయకులు మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి రొంగలి ముత్యాల నాయుడు, నాయకులు ఎర్ర దేవుడు మాట్లాడుతూ మహాసభలలో ప్రజా సమస్యలపై చర్చించనున్నట్లు చెప్పారు. ప్రారంభం రోజున బహిరంగ సభ నిర్వహిస్తున్నామని, ప్రజలు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని వారు కోరారు.



ప్రచారంలో పాల్గొన్న సిపిఎం నేత ప్రభావతి తదితరులు

గ్రామాభివృద్ధిలో సర్పంచులు కీలకపాత్ర పోషించాలి



నక్కపల్లిలో మాట్లాడుతున్న ఎంపిడిఒ సీతారామరాజు

ప్రజాశక్తి- నక్కపల్లి:గ్రామాభివృద్ధిలో సర్పంచులు కీలకపాత్ర పోషించాలని ఎంపీడీవో డి.సీతారామరాజు సూచించారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో రెండవ రోజు బుధవారం పంచాయతీ సుస్థిర అభివృద్ధి లక్ష్యాల పై శిక్షణ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. గ్రామాల అభివృద్ధి, చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై మందస్తుగా ప్రణాళిక రూపొందించుకోవాలన్నారు. ఆర్థిక నిధులతో అభివృద్ధి పనులు చేపట్టి, గ్రామాలను సుందరంగా తీర్చిదిద్దాలన్నారు. ముఖ్యంగా తాగునీరు, పారిశుధ్య నిర్వహణ పై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఐసిడిఎస్ ఆధ్వర్యంలో చేపడుతున్న కార్యక్రమాలపై అంగన్వాడీ కార్యకర్తలకు, వైద్య సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ నానాజీ, న్యాయంపూడి సర్పంచ్ రెడ్డి వరహాలుబాబు, సర్పంచ్ లు, పలు శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

రావికమతం: మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయ సమావేశ మందిరంలో సర్పంచులు, మండల స్థాయి అధికారులు, కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి ఏర్పాటు చేసిన శిక్షణ తరగతులు బుధవారంతో ముగిసాయి.రెండు బ్యాచ్లుగా విడదీసి శిక్షణ తరగతులు నిర్వహించడం జరిగిందని ఎంపీడీవో వెంకన్నబాబు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా గ్రామాల అభివృద్ధికి అధికారులను, ప్రజాప్రతినిధులను సమన్వయం చేస్తూ శిక్షణ తరగతులను నిర్వహించిందన్నారు.

కశింకోట : సచివాలయం అధికారులు, సిబ్బంది, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పంచాయతీలను అభివృద్ధి చేయాలని ఎంపీపీ కలగా లక్ష్మి గున్నయ్య నాయడు అన్నారు మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ అభివృద్ధి ప్రణాళికపై శిక్షణ బుధవారం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ వి.వి.రవి కుమార్, ఏంఇఒ వెంకటసురేష్, పంచాయతీ విస్తరణ అధికారి వెంకట లక్ష్మి, సర్పంచ్లు జయ రజని, నిమ్మదల సోమేశ్వరరావు, నీటిపల్లి రాజ్యలక్ష్మి, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

సబ్బవరం : స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ఈ నెల 17, 18 తేదీలలో నిర్వహించిన సచివాలయ సిబ్బంది శిక్షణ తరగతులు బుధవారం ముగిశాయి. ఈ సందర్భంగా ఎంపీడీవో పి పద్మజ మాట్లాడుతూ గ్రామీణ సమీకృత అభివృద్ధిపై సచివాలయ సిబ్బందికి, వీఆర్వోలకు, కార్యదర్శులకు శిక్షణ అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఈఓపిఆర్డి చైతన్య, పలు శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికి చర్యలు



కొత్తకోటలో వినతిపత్రాన్ని స్వీకరిస్తున్న తహశీల్దార్

ప్రజాశక్తి- నక్కపల్లి:భూ సమస్యలు పరిష్కరించేందుకే రెవిన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని తహసిల్దార్ నరసింహమూర్తి అన్నారు. మండలంలోని డిఎల్ పురం గ్రామంలో బుధవారం రెవిన్యూ సదస్సు నిర్వహించారు. కారిడార్ కోసం సేకరించిన భూ సమస్యలతో పాటు, ఇతర భూ సమస్యల పైన పలువురు అర్జీలను అందజేసారు. ఈ కార్యక్రమంలో సర్వేయర్ సత్తిబాబు పాల్గొన్నారు.

కొత్తకోట:రెవెన్యూ గ్రామాలలో నెలకొన్న భూ సంబంధిత సమస్యలు పరిష్కరానికి రెవిన్యూ సదస్సులు ఉపయోగపడతాయని తహసీల్దార్ వెంకటరమణ అన్నారు. రావికమతం మండలంలో కొత్తకోట గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద బుధవారం రెవిన్యూ సదస్సు నిర్వహించారుఈ కార్యక్రమంలో సర్పంచ్ కొన లోవరాజు, ఉప సర్పంచ్ దేవా, ఎంపీటీసీ శంకర్, డీసీఎంఎస్ మాజీ డైరెక్టర్ గుమ్ముడు సత్యదేవ్, ఆర్ఐ సతీష్, సర్వేయర్ సురేష్, వి ఆర్ఓ సుబ్బయ్య, కూటమి నాయకులు కోట గోవిందరావు, కోట సత్యనారాయణ, ఉగ్గిన శ్రీను, నీటి సంఘం చైర్మన్ నర్సింగరాజు పాల్గొన్నారు.

గొలుగొండ:గొలుగొండ గ్రామంలో బుధవారం రెవెన్యూ సదస్సు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ పి.శ్రీనివాసరావు రైతుల సమస్యలపై వినతులు స్వీకరించారు. మండలం తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు అడిగర్ల అప్పలనాయుడు, మాజీ సర్పంచ్ పారేపల్లి నాగేశ్వరరావు, బిసి కార్పొరేషన్ డైరెక్టర్ పుల్లేటికుర్తి రమేష్, మాజీ సర్పంచ్ చిట్టిబాబు, మాజీ ఉపసర్పంచ్ రాయపురెడ్డి రాము, తెలుగు యువత ఉపాధ్యక్షులు గండేపల్లి రాము పాల్గొన్నారు.

సబ్బవరం : గ్రామాల్లో భూ సమస్యల పరిష్కారానికే ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నదని తహసీల్దార్ బి.చిన్నికృష్ణ అన్నారు. మండలంలోని అంతకాపల్లి గ్రామంలో బుధవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొని రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు. సర్పంచ్ సబ్బవరపు నారాయణమూర్తి, ఉప సర్పంచ్ గొర్లె అప్పారావు, మాజీ సర్పంచ్లు సబ్బవరపు దేముడుబాబు, రొంగలి దేముడుబాబు, నాయకులు మిడతాడ మహాలక్ష్మి నాయుడు, ఏడి సర్వే ఎస్ గోపాల్ రాజ్, రీ సర్వే డీటీ గణపతిరావు, సర్వేయర్ ఎల్ అప్పారావు, వీఆర్వోలు రుక్మిణి, నూకరత్నం పాల్గొన్నారు.

బుచ్చయ్యపేట : మండలంలోని గున్నేంపూడి గ్రామంలో మండల తహసీల్దార్ ఎం.లక్ష్మి ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ప్రజల నుండి వినతులను స్వీకరించారు. రెవెన్యూ సమస్యలన్నీ అధికారులు దృష్టికి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో ముచ్చకర్ల హరిణి అప్పారావు, నీటి సంఘ చైర్మన్ సోమిరెడ్డి నాయుడు, జనసేన అధ్యక్షులు గుండు గణేష్ పాల్గొన్నారు.

కె.కోటపాడు : భూముల సమస్యలపై రైతులు రెవెన్యూ సదస్సులో దరఖాస్తు చేసుకోవాలని మండల సర్వేయర్ రామచంద్రమూర్తి కోరారు. మండలంలోని ఆర్వై అగ్రహారం గ్రామంలో బుధవారం జరిగిన రెవెన్యూ సదస్సులో రైతుల నుండి దరఖాస్తులను స్వీకరించారు. గ్రామ సర్పంచ్ కన్నూరు నాగభూషణం, ఉప సర్పంచ్ లెక్కల అచ్చిబాబు, వీఆర్వో గంగు నాయుడు, సర్వేయర్లు మీసాల కేశవ, త్రినాథ పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులపై రైతు నేత అసంతృప్తి

అచ్యుతాపురం : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గ్రామ రెవెన్యూ సదస్సులపై ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కర్రి అప్పారావు అసంతృప్తి వ్యక్తం చేశారు. మండలంలోని తిమ్మరాజుపేటలో బుధవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు ఆయన హాజరై మాట్లాడారు. గత రెవెన్యూ సదస్సులో తన వ్యక్తిగతంగా ఏడు సమస్యలు అధికారులు దృష్టికి తీసుకువెళ్లడం జరిగిందని, వాటిలో ఏ ఒక్క సమస్య పరిష్కారం కాలేదని పేర్కొన్నారు. అలాంటప్పుడు ఈ రెవెన్యూ సదస్సులు ఎందుకని ప్రశ్నించారు. జగనన్న రీ సర్వేలో ఇచ్చిన పాత పుస్తకాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ రెవెన్యూ సదస్సులో శరగడం శివ బాబు నాయుడు, శరగడం నాగార్జున, ఆడారి అర్జున్, కర్రి పెంటారావు, కర్రి భద్రాజులు, డిటి, సర్వేయర్, విఆర్ఓ పాల్గొన్నారు.

ఆనందపురం : మండలంలో బోని గ్రామంలో బుధవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో భీమిలి ఆర్డిఒ సంగీత్ మాథుర్ పాల్గొని, రైతుల నుంచి భూసమస్యలపై పలు అర్జీలను సేకరించారు. కార్యక్రమంలో మండల తాసిల్దార్ శ్యామ్ ప్రసాద్, మాజీ సర్పంచ్ వరప్రసాద్, బోనిఅప్పలనాయుడు, సన్యాసినాయుడు, వీఆర్ఓ అప్పారావు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న నాయకులు

ఘనంగా మాకిరెడ్డి రాజుబాబు వర్ధంతి

ప్రజాశక్తి-గొలుగొండ:మండలంలోని చోద్యం గ్రామంలో కామ్రేడ్ మాకిరెడ్డి రాజుబాబు 26వ వర్ధంతి బుధవారం సిపిఐ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజుబాబు స్థూపం వద్ద నివాళి అర్పించారు. అనంతరం సిపిఐ జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ మాట్లాడుతూ, ప్రజా సమస్యలపై ఎన్నో పోరాటాలు చేశారన్నారు. ప్రభుత్వ సంస్థలు, పరిశ్రమలు పెట్టి ప్రభుత్వ రంగాలను కాపాడాలనే ఉద్దేశం ప్రధాని నరేంద్ర మోడీకి ఏమాత్రం లేదన్నారు. మతాల పైన కులాల పైన రాజకీయ చిచ్చులు పెట్టడమే లక్ష్యంగా చేసుకొని పదవులు పొందుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు, మాకిరెడ్డి రామునాయుడు, మేకా సత్యనారాయణ, గురుబాబు, కొండలరావు పాల్గొన్నారు.

22 ఎ సమస్యపై రెవెన్యూ మంత్రికి వినతి

ప్రజాశక్తి-నక్కపల్లి:మండలంలో ఉపమాక అగ్రహారంలో సర్వే నెం 112లో 27.01 ఎకరాలు స్థలం 22 ఏలో నమోదు కావడంతో రిజిస్ట్రేషన్లు నిలుపుదల చేయడంతో స్థల నివాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని 22 ఎ రికార్డు నుండి గ్రామకంఠం స్థలమును తొలగించాలని రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్య ప్రసాద్ కు బుధవారం జిల్లా పరిషత్ కోఆప్షన్ మాజీ సభ్యులు కొప్పిశెట్టి కొండబాబు, ఉపమాక వెంకన్న ఆలయ మాజీ చైర్మన్ కొప్పిశెట్టి బుజ్జి, గ్రామ సర్పంచ్ ప్రగడ వీరబాబు, నాయకులు కొప్పిశెట్టి వాసు, తోలేటి శ్రీనివాస్ వినతిపత్రం అందజేశారు. నక్కపల్లిలో రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత స్వగృహానికి రెవెన్యూ శాఖ మంత్రి బుధవారం విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయనను కలిసి సమస్యను విన్నవించారు. గ్రామ కంఠం భూమి 22 ఏ లో నమోదు కావడంతో 2018 సంవత్సరం నుండి రిజిస్ట్రేషన్లు జరగకపోవడంతో క్రయ, విక్రయాలు జరుపుకునే అవకాశం లేకుండా పోయిందని తెలిపారు. దీంతో స్థిర నివాసులు ఇబ్బందులు పడుతున్నారని మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. గ్రామ సర్వే నెం. 112లో 27.01 సెంట్లు స్థలం 22 ఎ(1) (సి) క్రింద రిలీజియన్



వినతిపత్రాన్ని ఇస్తున్న నాయకులు

ఆఫ్ ఛారిటబుల్ ఇనిస్టిట్యూషన్ కింద ఎండోమెంట్ భూములుగా నమోదు కాబడినవిగా ఉన్నవని, రిజిస్ట్రేషన్లు జరగకుండా నిషేధిపమని ఎపి దేవాదాయ ధర్మదాయశాఖ నక్కపల్లి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి లిఖిత పూర్వకంగా తెలియజేయడంతో రిజిస్ట్రేషన్లు నిలుపుదల చేసారని, దీంతో అప్పటి నుండి ఈ స్థలానికి సంబంధించి ఎటువంటి లావాదేవీలు జరకుండా రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. 2018 సంవత్సరానికి ముందు రిజిస్ట్రేషన్లు జరిగేవని తెలియజేశారు. 22 ఏ నుండి గ్రామకంఠం భూమిని తొలగించి యథావిధిగా రిజిస్ట్రేషన్లు జరిగే విధంగా చర్యలు చేపట్టాలని మంత్రిని కోరారు. ఈ సమస్యపై మంత్రి సానుకూలంగా స్పందించారు.



పోస్టర్ను ఆవిష్కరిస్తున్న మంత్రులు

28న మెగా జాబ్ మేళా

ప్రజాశక్తి- నక్కపల్లి:ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి ఆధ్వర్యంలో పాయకరావుపేటలో శ్రీ ప్రకాష్ విద్యా సంస్థల్లో నందు ఈనెల 28 శనివారం నాడు నిర్వహించనున్న మెగా జాబ్ మేళాను నిరుద్యోగ యువతీ, యువకులు సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత సూచించారు. నక్కపల్లి లో క్రిస్ టౌన్ షిప్ వద్ద ఆమె స్వగృహం నందు బుధవారం రెవిన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్తో కలిసితో మెగా జాబ్ మేళా పోస్టర్ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా హోం మంత్రి అనిత మాట్లాడుతూ, పాయకరావుపేట నియోజకవర్గంలో నిరుద్యోగ యువతీ, యువకులకు ఉపాధి కల్పించాలన్న ధ్యేయంతో మెగా జాబ్ మేళాను ఏర్పాటు చేస్తున్నామని, 50 కంపెనీలకు పైగా జాబ్ మేళాకు హాజరవుతున్నట్లు తెలియజేశారు. ఈ మెగా జాబ్ మేళాకు హాజరయ్యే అభ్యర్థులు సులభంగా రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు ప్రత్యేక క్యూఆర్ కోడ్ కూడా స్కిల్ డెవలప్మెంట్ వారు అందుబాటులో ఉంచినట్లు వెల్లడించారు.



ఎన్నికైన నూతన కార్యవర్గ సభ్యులు

నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి -రావికమతం: సిద్ధి వినాయక మండల నాయి బ్రాహ్మణ సంక్షేమ సేవా సంఘం నూతన కార్యవర్గం మండల కేంద్రంలో బుధవారం ఏర్పాటైంది. అధ్యక్షులుగా చినపాశిల గ్రామానికి చెందిన పేలూరి మూర్తి, కార్యదర్శిగా రావికమతం గ్రామానికి చెందిన పి.పోతురాజు, ఉపాధ్యక్షులుగా కితంపేట గ్రామానికి చెందిన సగరపు నాగేశ్వరరావు, కోశాధికారిగా కొత్తకోట గ్రామానికి చెందిన పి.రామకృష్ణ, జాయింట్ సెక్రటరీగా మేడివాడకు చెందిన ఎస్.శ్రీను, డైరెక్టర్లుగా సి హెచ్. శ్రీనివాసరావు, కే.శ్రీను, జి.చిరంజీవి, కే .కొండలరావులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా సంఘ అధ్యక్షులు పేలూరి మూర్తి మాట్లాడుతూ, నాయి బ్రాహ్మణుల సంక్షేమ సేవా సంఘం నూతన అధ్యక్షునిగా ఎన్నుకున్నందుకు అందరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. సంఘం బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు.



బాధితులకు చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే బండారు

సిఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి- మాడుగుల:ప్రమాదాల బారిన పడి ఆసుపత్రిలో వైద్యం కోసం ఇబ్బందులు పడుతున్న వారికి సీఎం సహాయనిది కొంతమేర ఊరట కలిగిస్తుందని ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి అన్నారు. బుధవారం మాడుగుల స్థానిక ఆర్ అండ్ బి వసతి గృహంలో బాధితులకు ఆయన చేతుల మీదగా రూ.3,37,779లు చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ, జనసేన మండల అధ్యక్షులు అద్దేపల్లి జగ్గారావు, గట్రెడ్డి శివాజీ, కార్యదర్శులు ఉండూరు దేవుడు, మాజీ ఎంపీపీ పుప్పాల అప్పలరాజు, రంజిత్ వర్మ పాల్గొన్నారు.

పేకాట శిబిరంపై దాడి

ప్రజాశక్తి-రోలుగుంట:మండలంలోని వెలంకాయల పాలెం గ్రామ శివారులో పేకాట శిబిరంపై బుధవారం రోలుగుంట పోలీసులు దాడులు చేపట్టారు. ఈ సందర్భంగా పది మంది పేకాటరాయుళ్లను పట్టుకొని వారి వద్ద నుంచి రూ.18200 నగదును సీజ్ చేశామని ఎస్ఐ రామకృష్ణారావు తెలిపారు.


పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

21న మెగా రక్తదాన శిబిరం

ప్రజాశక్తి-గొలుగొండ:మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి జన్మదినంను పురస్కరించుకొని ఈ నెల 21న నర్సీపట్నం మాజీ ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్ క్యాంపు కార్యాలయంలో జరిగే మెగా రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలని గొలుగొండ ఎంపిపి గజ్జలపు మణికుమారి కోరారు. బుధవారం గొలుగొండ మండల పరిషత్ కార్యాలయ సమీపంలో రక్తదాన శిబిరం పోస్టర్లను ఆవిష్కరించారు. మండలంలో యువత, పెద్దలు నాయకులు అందరూ ఈ శిబిరంలో పాల్గొని రక్తదానం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి సుర్ల ఆదినారాయణ, మండల ప్రధాన కార్యదర్శి కొల్లు సత్యనారాయణ, చింతల బుల్లిప్రసాద్, గుండుపాల సర్పంచ్ జోగా రామకృష్ణ, పప్పుశెట్టిపాలెం సర్పంచ్ మాకిరెడ్డి విజయలక్ష్మి, ఏఎల్.పురం సర్పంచ్ లోచల సుజాత, వైసీపీ యూత్ అధ్యక్షులు మాకిరెడ్డి రామకృష్ణనాయుడ, విప్పలపాలెం సర్పంచ్ నల్లబెల్లి శ్రీనివాస్, లంగంపేట పరవాడ కవి, లింగంపేట సర్పంచ్ తోకల సంతోష్ కుమార్, కసిమి సర్పంచ్ శ్రీను తదితరులు పాల్గొన్నారు.


బోరు పనులను ప్రారంభిస్తున్న నాయకులు

బోరు నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి -రావికమతం: జల జీవన్ మిషన్ పథకం ద్వారా మంజూరైన బోరు నిర్మాణ పనులను సర్పంచ్ దాసరి సూర్యకుమారి ప్రారంభించారు. మండలంలో కవగుంట గ్రామంలో జలజీవన్ మిషన్ పథకం ద్వారా ప్రతి ఇంటికి కొళాయిలు ద్వారా మంచినీటిని అందించేందుకుగాను 41 లక్షల రూపాయలు నిధులు మంజూరు అయ్యాయన్నారు. గ్రామంలో పైపులైను పనులు పూర్తి చేశామన్నారు.వాటర్ ట్యాంకు నిర్మాణం చేపట్టవలసి ఉందన్నారు. ట్యాంకు నిర్మాణం పూర్తయితే గ్రామ ప్రజలందరికీ మంచినీటి కష్టాలు తీరుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ వార్డు మెంబర్ వి . అప్పారావు, పి.రాము, సారిక రాము, పరవాడ రమణ, శ్రీను పాల్గొన్నారు.


ఊరేగిస్తున్న భక్తులు

ఘనంగా వెంకన్న తిరువీధి సేవ

ప్రజాశక్తి- నక్కపల్లి:ప్రాచీన పుణ్యక్షేత్రమైన ఉపమాక వెంకన్న ఆలయంలో ధనుర్మాస ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. బుధవారం ఉత్సవాల్లో భాగంగా శ్రీదేవి భూదేవి సమేత శ్రీనివాసుని ఉత్సవ మూర్తులను ఇత్తడి సప్పర వాహనం పైన, గోదాదేవి అమ్మవారి ఉత్సవ మూర్తులను పల్లకీలోనూ అధిష్టింపజేసి గ్రామ తిరువీధి సేవ నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయంలో భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు ప్రసాద్ ఆచార్యులు, అర్చకులు కృష్ణమాచార్యులు, శేషాచార్యులు, గోపాలాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

అల్పపీడనంతో.. ఆందోళనలో అన్నదాతలు


మునగపాకలో కోసిన వరి పొలం

ప్రజాశక్తి-మునగపాక : బుధ, గురువారాలలో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేయడంతో మండలంలోని వరి రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. మండలంలో ఈ ఏడాది వరి సాగు ఎక్కువగా చేపట్టారు. అయితే పంట చేతికొచ్చే సమయంలో వరుస తుపాన్లు రావడంతో పంట అందకుండా పోతోందని అన్నదాతలు ఆవేదన చెందుతున్నారు. తుపాను కారణంగా పొలాలు కోస్తే వర్షానికి తడిసి పశుగ్రాసానికి కూడా పనికి రాకుండా పోతాయని భయం ఒకపక్క, కోయకుండా వదిలేస్తే వర్షంతో పాటుగా ఈదురుగాలులు వీచి నేలమట్టం అయిపోతాయని దిగులు మరొక పక్క రైతులను వెంటాడుతోంది. గత మూడు సంవత్సరాలుగా కోత దశకు వచ్చే సమయంలో వరుస తుపానులు కారణంగా పంటలకు అపార నష్టం వాటిల్లుతుందని అన్నదాతలు ఆవేదన చెందుతున్నారు.

రైతన్నల దిగులు

కె.కోటపాడు : సుమారు 20 రోజులుగా వరుస తుఫానులతో రైతన్నలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఈ కాలంలో రైతులు మండలంలో 80శాతానికి పైగా వరి కోతలు కోసినప్పటికీ మిగిలిన 20 శాతం మంది రైతులు వరి కోతలకు ఉపక్రమించే సమయంలో భారీ వర్షాలు హెచ్చరికలు రావడంతో బెంబేలెత్తి పోతున్నారు. బాగా పండిన వరి ఇక కోయకుంటే వెన్నులు నేలకు వదిలేసే పరిస్థితి నెలకొంది. కొన్నిచోట్ల వర్షం రాదన్న ధీమాతో రైతులు వరి కోతలు వేశారు. మంగళవారం రాత్రి నుండి చినుకులు ప్రారంభమై బుధవారానికి మరి కాస్త పెద్దది కావడంతో కొన్నిచోట్ల వరి పనలు తడిసిపోయాయి. వర్షానికి తడిసిపోయిన వరి పనలపై ఒక లీటరు నీటికి 50 గ్రాముల కల్లుప్పు కలిపి వరి కంకులపై పిచికారి చేయాలని మండల వ్యవసాయ అధికారి సోమశేఖర్ సూచించారు. దీనివలన వరి గింజలు మొలకెత్తకుండా ఉండి రైతులకు ఏమాత్రం నష్టం జరగదని తెలిపారు.

రైతులు బిగులు

రోలుగుంట:తుపాన్ హెచ్చరికల నేపథ్యంలో అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మంగళవారం రాత్రి చినుకులు పడటంతో బుధవారం ఉదయం నుంచి రైతులు పరుగులు తీశారు. వారం రోజుల నుండి వరి కోతలు ప్రారంభమై కొన్ని చోట్ల పొలాల్లోనే కోసిన వరి పనలు ఉండగా కొన్ని చోట్ల కుప్పలు వేశారు. ఈ సమయంలో తుపాన్ కారణంగా వర్షం కురిస్తే అపార నష్టం వాటిల్లుతుందని రైతుల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


రోలుగుంటలో కుప్పను పెడుతున్న రైతులు

మండలంలో సాధారణ విస్తీర్ణం 1337 హెక్టార్లు కాగా ఈ ఏడాది 1387 హెక్టార్లు అధికంగా పంటను వేశారు. దీంతో ప్రస్తుతం పంటను కాపాడుకునే పనిలో రైతన్నలు నిమగ్నమయ్యారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారి విజయలక్ష్మి మాట్లాడుతూ.. తుపాన్ ప్రభావం తగ్గేంత వరకు వరి కోతలను, నూర్పులను వాయిదా వేసుకోవాలన్నారు. కోసిన వరి పంటను వెంటనే చిన్నచిన్న కుప్పలుగా పెట్టుకొని టార్పాలిన్లు కప్పుకోవాలని సూచించారు.

200 పడకల ఆసుపత్రిగా విస్తరించేందుకు కృషి

-స్పీకర్ అయ్యన్నపాత్రుడు

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్: స్థానిక ఎన్‌టీఆర్ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిని 150 పడకల నుండి 200 పడకల ఆసుపత్రిగా విస్తరించేందుకు కృషి చేస్తున్నట్లు స్పీకర్ అయ్యన్న తెలియజేశారు. బుధవారం సాయంత్రం స్థానిక ఏరియా ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన అభివృద్ధి కమిటీ సమావేశంలో స్పీకర్ అయ్యన్న పాత్రుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆసుపత్రి అభివృద్ధి కోసం నిధుల సేకరణకు సహకారం అందించనున్నట్లు స్పీకర్ హామీ ఇచ్చారు. ప్రతి నెల అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించాలని సూచించారు. గత ఐదు సంవత్సరాల్లో ప్రైవేట్ హాస్పిటళ్లకు రోగులను రిఫర్ చేసిన వివరాలు ఎందుకు చేయవలసి వచ్చిందో కారణాలతో సమర్పించాలని స్పీకర్ ఆదేశించారు. శానిటేషన్, రోగుల భోజనంలో మెరుగుదల ఉండాలని అందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. డాక్టర్లు నివాస భవనాలను మరమ్మతులు చేసి వాడుకలోకి తీసుకురావాలని, ఇందుకు రూ. 15 లక్షల నిధుల కేటాయింపుకు తొడ్పాటు చేస్తానని స్పీకర్ తెలిపారు. అంబులెన్సు ను తక్షణమే మరమ్మత్తు చేసి వినియోగంలోకి తేవాలని సూచించారు. సి.టి. స్కాన్ అవసరాన్ని డాక్టర్లు సూచించగా, దీని ఏర్పాటుకు రూ. 2.5 కోట్లు ఖర్చు అవుతుందని డి.సి.హెచ్.ఎస్. శ్రీనివాస్ వెల్లడించారు. ఇందుకు అవసరమైన నిధుల కోసం ఎన్‌ఆర్‌ఐల నుండి కృషి చేస్తానని అయ్యన్న తెలిపారు. ఈ సమావేశంలో డి.సి.హెచ్.ఎస్. శ్రీనివాస్, ఆర్‌డిఓ వి.వి. రమణ, మునిసిపల్ కమిషనర్ జె.సురేంద్ర, సూపరింటెండెంట్ డాక్టర్ సుధాశారద, అభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు

విఎస్ఇజెడ్ ద్వారా రూ.1.27 లక్షల కోట్ల ఎగుమతులు

-61 లక్షల మందికి ఉపాధి

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

2024-25 ప్రథమార్థంలో (ఏప్రిల్-సెప్టెంబర్ 2024) విఎస్ఇజెడ్ రూ.1,27,744 కోట్ల ఎగుమతులు నమోదు చేసిందని, గత ఏడాదితో పోలిస్తే 22 శాతం వృద్ధిని నమోదు చేసిందని విశాఖ స్పెషల్ ఎకనామిక్ జోన్ జోనల్ డెవలప్‌మెంట్ కమిషనర్ శ్రీనివాస్ ముప్పాల బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో సేవల ఎగుమతులు రూ.78,376 కోట్లు, వాణిజ్య ఎగుమతులు రూ.49,368 కోట్లుగా పేర్కొన్నారు. జులై-సెప్టెంబర్ మధ్యకాలంలో రెండు కొత్త సెజ్ యూనిట్ ప్రతిపాదనలు (ఆంధ్రప్రదేశ్ - 1, తెలంగాణ - 1) ఆమోదం పొందాయని పేర్కొన్నారు.

61.18 లక్షల మందికి ఉపాధి....

విఎస్ఇజెడ్ రూ.1,12,276 కోట్ల పెట్టుబడులను ఆకర్షించి 2024 మార్చి 31 నాటికి 6,18,551 మందికి ఉపాధి కల్పించిందని తెలిపారు.


జోనల్ డెవలప్‌మెంట్ కమిషనర్ శ్రీనివాస్

2024 జులై-సెప్టెంబర్ మధ్యకాలంలో తెలంగాణ రాష్ట్రంలో 1 కొత్త సెజ్ యూనిట్ ప్రతిపాదనకు, ఆంధ్రప్రదేశ్‌లో 1 కొత్త సెజ్ యూనిట్ ప్రతిపాదనకు ఆమోదం లభించిందని పేర్కొన్నారు. కొత్తగా మంజూరైన సెజ్ యూనిట్ల ద్వారా రూ.11 కోట్ల పెట్టుబడితో 305 మందికి ఉపాధి లభించనుందని తెలిపారు.

విశాఖపట్నంలోని విప్రో లిమిటెడ్ స్పెషల్ ఎకనామిక్ జోన్‌లో ఐటి/ఐటి ఎనేబుల్డ్ సేవలను అందించడానికి మెసర్స్ ఇన్నోసిటో ప్రైవేట్ లిమిటెడ్‌కు ఒక కొత్త సెజ్ యూనిట్ ప్రతిపాదనకు ఆమోదం లభించిందని వివరించారు. తెలంగాణలో ఐటి సేవలు అందించేందుకు మెస్సర్స్ టెరాఫినా సర్వీసెస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌కు కొత్త సెజ్ యూనిట్ ప్రతిపాదనకు ఆమోదం లభించిందని తెలిపారు.


డ్రెయినేజీలో నిలిచిపోయిన చెత్తాచెదారం

అస్తవ్యస్తంగా డ్రెయినేజీ

ప్రజాశక్తి- మాడుగుల:మండలంలోని కింతలి గ్రామం లో డ్రెయినేజీ అస్తవ్యస్తంగా మారింది. డ్రెయినేజీలో ఎక్కడి కక్కడు వ్యర్థాలు నిలిచి పోవడంతో మురుగనీరు ఎటు వెళ్లకుండా నిలిచి పోయింది.నూతనంగా నిర్మించిన రోడ్డు పక్కన డ్రైనేజీ కాలువలు లేకపోవడంతో వాడుక నీరు నిల్వ ఉండిపోవడంతో తీవ్రదుర్గంధం వెదజల్లుతుంది. దీంతో దోమలు ఎక్కువ కావడంతో రాత్రులు ఇబ్బందికరమైన పరిస్థితి ఉందని పలువురు వాపోతున్నారు. పంచాయతీ పాలకవర్గం వెంటనే గ్రామంలో దృష్టి సారించి వ్యర్థాలను తొలగించి, మురుగునీరు పోయే విధంగా ప్రత్యామ్నాయ మార్గం చూడాలని పలువురు కోరుతున్నారు.